ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 09.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 229 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



ఆసిస్ తో చివరి టీ20 కూడా వర్షార్పణం 12







పతాకస్థాయికి ప్రచారం

నేటి సాయంత్రంతో పరిసమాప్తం

సర్వశక్తులు ఒడ్డుతున్న మూడు పార్టీలు

- ఇక ఈ రెండు రోజులే వారికి అతి కీలకం
- తూటాల్లా పేలుతున్న నేతల మాటలు
- హద్దులు దాటిన విమర్శలు, ప్రతి విమర్శలు
- 'జూబ్లీ' ఉప ఎన్నిక మేమే గెలిచి తీరుతాం
- ఓడినా, గెలిచినా మాది ఎప్పుడూ ప్రజా పక్షం
- ఓడితే ప్రతిపక్షాలు ఏం చేస్తాయో చెప్పాలి
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రెండేండ్ల పాలనలో వారు చేసిందేమీ లేదు
- గత కాంగ్రెస్ పాలన చూపి ఓట్లడుగుతున్నారు
- ఓడిపోతున్నామని వారికి ఇప్పటికే అర్థమైంది
- ప్రచార సభలలో మాజీ మంత్రి కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 8 : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగియనుంది. దీంతో మూడు జాతీయ పార్టీలు ప్రతి ఒక్క ఓటర్‌ను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే వారి మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి ప్రతిపక్షాల విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కచ్చితంగా ప్రతి ఎన్నిక కూడా తమకు పరీక్షేనని చెప్పారు. గెలిస్తే అందుకు సహకరించిన అంశాలు, ఓడిపోతే అందుకు కారణాలను విశ్లేషించుకుంటామని అన్నారు. ప్రతిపక్షాలు చేసే ప్రతి సవాల్‌ను స్వీకరించే తీరిక తమకు లేదని వివరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో తాము గెలుస్తున్నామని, బీజేపీకి కనీసం డిపాజిట్ కూడా రాదని స్పష్టం చేవారు. దీనికి కౌంటర్‌గా ప్రతిపక్షాలు మాత్రం రేవంత్ రెడ్డి 'హ్యాండ్సప్' అనేశారని విమర్శలు చేస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మృతితో వచ్చిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక హీట్ పీక్‌స్‌కు చేరింది. రెండు రోజులలో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు పార్టీలు బస్తీ బాటపట్టాయి. ఇన్ని రోజులు గ్రౌండ్‌లో దిగి ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కాంగ్రెస్

..:: మిగతా 2లో

గతంలో కాంగ్రెస్ చేసిన పనులు, రెండేండ్లుగా తాము చేసిన పనులు, పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన పనులు బేరీజు వేసుకొని ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులను కేసీఆర్ కొనసాగించారే తప్ప హైదరాబాద్‌కు కొత్తగా చేసిందేమీ లేదని అన్నారు. మెట్రో నిర్మాణ విషయంలో ఎల్అండ్ టీ వద్ద కమీషన్లు కొట్టేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దాన్ని పూర్తిగా నష్టాలలోకి తీసుకెళ్లారని అన్నారు. ఇప్పుడు దాన్ని విస్తరించడానికి కేంద్రం మోకాలడ్డుతోందని విమర్శించారు. వారు ఊహించని విధంగా ప్రభుత్వమే మెట్రోను కొనుగోలు చేసేసరికి వారికి ఏం చేయాలో అర్థం కావడం లేదని అన్నారు.

కాయ్ రాజా కాయ్!

'జూబ్లీ' ఫలితంపై జోరుగా పందేలు

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో భారీ పెట్టుబడులు



- రెండు రాష్ట్రాలలో బెట్టింగ్ ముఠాల సందడి
- సోషల్ మీడియా గ్రూపులలో విస్తృత చర్చ
- ఎవరికి వారే 'అంచనాలు' చెబుతున్న సర్వే సంస్థలు
- తొలిసారిగా తీవ్ర ఉత్కంఠను పెంచిన ఉప ఎన్నిక
- మూడు పార్టీలలోనూ విజయంపై లోలోన గుబులే
- బయటకు మాత్రం మేకపాతు గాంభీర్యమే
- దీంతో బెట్టింగ్ రాయుళ్లు కూడా గందరగోళంలోనే

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 8: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తెలంగాణ రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. జూబ్లీహిల్స్‌లో ప్రచారం ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ నెల 11న జరగనున్న ఈ ఉప ఎన్నికపై రాజకీయ పార్టీలు పోటాపోటీగా తలపడుతున్నాయి. ఒకవైపు సీటును నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ కసరత్తు చేస్తుంటే, మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా గెలవాలనే సంకల్పంతో దూసుకుపోతోంది. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గాలలో నిర్వహించిన కార్నర్ మీటింగులతో ఆ పార్టీ నేతలు, శ్రేణులు మరింత ఉత్సాహంగా ప్రచారానికి పదును పెట్టారు. అదే సమయంలో బీజేపీ కూడా ఈ పోటీలో తన ఉనికిని చాటుకునేందుకు ఆసక్తిగా ఉంది. సాధారణ ఉపఎన్నిక కన్నా ఇది రాజకీయ ప్రతిష్ఠ పోరుగా మారింది. అయితే, ఈ రాజకీయ రగడ మధ్యలో పందేలు, బెట్టింగ్ రాయుళ్ల చర్చ కూడా జోరుగా ఉంది. 'కాయ్ రాజా కాయ్' అంటూ జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రధాన వనరుగా మారింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికలుగా బెట్టింగ్ ముఠాలు పెద్ద సంఖ్యలో ఫలితాలపై బెట్టింగ్ వేస్తున్నాయని సమాచారం. పట్టణ ఓటర్లు, మధ్య తరగతి, వ్యాపారవేత్తలు, వలస కూలీలు, మైనార్టీలతో కూడిన ఈ నియోజకవర్గం ప్రతిసారి వేర్వేరు రాజకీయ సంకేతాలను ఇస్తోంది. ఎన్నిక ప్రచారం ఉత్సాహంగా సాగుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల కంటే బెట్టింగ్ రాయుళ్లు ఎక్కువ ఉత్సాహం చూపిస్తున్నారు. పందేలు కాస్తూ, గెలుపు ఎవరిదో అంచనా వేసేందుకు కూడా


..:: మిగతా 2లో



ప్రధాని మాటల ద్వారా రెచ్చగొడుతున్నారు

ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి కాంగ్రెస్ నేత, ఎంపీ ప్రియాంకాగాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తుపాకీ వంటి పదాలను ఉపయోగించి ఆయన తన గౌరవాన్ని పోగొట్టుకుంటున్నారని అన్నారు.

11



పాక్ అణు కేంద్రంపై దాడిని ఇందిర అడ్డుకున్నారు

అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి రిచర్డ్ బార్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ అణ్వాయుధ ఆశయాన్ని అడ్డుకునేందుకు భారత్-ఇజ్రాయెల్ కలిసి చేసిన రహస్య ప్రణాళికను అప్పటి ప్రధాని ఇందిర తిరస్కరించినట్లు చెప్పారు.

11

డిసెంబర్ 1నుంచి పార్లమెంటు సమావేశాలు

- 19వ తేదీ వరకు 15 రోజులు కొనసాగింపు
- నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- 15 రోజులు తక్కువ సమయమన్న కాంగ్రెస్
- వారికి బిల్లులు, చర్చలు అవసరం లేదేమోనని వ్యాఖ్య

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 8: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయి. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. డిసెంబర్ 1 నుంచి 19 వరకు శీతాకాల సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని వివరించారు. ఈ శీతాకాల సమావేశాలను ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసేలా

..:: మిగతా 2లో



సీఎం తన భాషను మార్చుకోవాలి



- కాలేజీ యాజమాన్యాలను గౌరవించాలి
- ఆకస్మిక వరదలతో పేదలకు భారీ నష్టం
- వారందరికీ పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వాలి
- విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- జాగృతి జనం బాటలో కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, హన్మకొండ

నవంబర్ 8: ముఖ్యమంత్రి ఉపయోగిస్తున్న వీధి రౌడీ భాష మార్చుకోవాలని జాగృతి అధ్యక్షురాలు కవిత సూచించారు. జనంబాట కార్యక్రమంలో భాగంగా శనివారం హన్మకొండకు చేరుకున్న కవితకు ఫాతిమా నగర్ వద్ద జాగృతి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వరంగల్, హన్మకొండలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఐదు నియోజకవర్గాలలో ప్రజలను, విద్యార్థులను, కాలేజీ యాజమాన్యాలను కలుసుకుని సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కవిత విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'మేము కౌన్సిల్‌లో గట్టిగా మాట్లాడిన తరువాతనే సీఎం రేవంత్ స్పందించారు. పాత బకాయిలతో పాటు ఈ యేడాది బకాయిలు కూడా చెల్లిస్తామని చెప్పారు. కానీ, నిన్న జరిగిన ప్రెస్ మీట్ లో సీఎం వీధి రౌడీలు కూడా సిగ్గు పడే విధంగా మాట్లాడారు' అని మండి పడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీలు రాకపోవడంతోనే కొందరు లోన్లు తీసుకుని తెలంగాణ విద్యార్థుల కోసం కాలేజీలు ఏర్పాటు చేశారని అన్నారు. ఇప్పుడు వారికి బెదిరింపులు ఎందుకు? మీరు ఇచ్చిన మాట తప్పి, వారి మీద వీరంగం

..:: మిగతా 2లో



ఎలన్ మస్క్ కు 88 లక్షల కోట్ల ప్యాకేజీ

ప్రపంచంలోనే అత్యధిక వేతనం తీసుకుంటున్న వ్యక్తిగా రికార్డ్ సృష్టించాడు టెస్లా అధినేత మస్క్ టెస్లా ఎక్స్, స్పేస్ ఎక్స్ కంపెనీల అధినేతగా ప్రపంచ కుబేరుడిగా పేరుపొందాడు మస్క్.

11



14 తర్వాత రాష్ట్రంలో పెను తుఫాను

- ఒక్కసారి ఓటేసినందుకే మోసం చేసింది
- మళ్లీ సరికొత్త మోసానికి కాంగ్రెస్ తెర తీసింది
- అభివృద్ధి పేరుతో మరోసారి ఓటడుగుతోంది
- జూబ్లీహిల్స్ ఓటర్లు వారి వంచనను గమనించాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 8 : అభివృద్ధి పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు కాంగ్రెస్ రెడీ అయ్యిందని కేటీఆర్ హెచ్చరించారు. ఇదే పేరుతో అసెంబ్లీ ఎన్నికలలో మోసం చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. మళ్లీ మోసపోకుండా జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న రాష్ట్రంలో పెను తుఫాను రాబోతోందని అన్నారు. రెండేండ్లలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధమయ్యారని తేల్చిచెప్పారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని కూడా

..:: మిగతా 2లో



ఊరంతా నాటు కోడి పులుసే!

- పొలాలలో 2000 నాటుకోళ్లు ప్రత్యక్షం
- వదిలేసి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు
- కోళ్ల కోసం ఎగబడిన గ్రామస్తులు
- వాటిని ఎవరూ తినవద్దన్న వైద్యాధికారులు
- పరీక్షల కోసం ప్రయోగశాలకు కోళ్ల తరలింపు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

నవంబర్ 8: ఎల్కతుర్తిలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు వేల నాటు కోళ్లను వదిలి వెళ్లారు. సిద్దిపేట -ఎల్కతుర్తి రహదారి వెంట

..:: మిగతా 2లో



మహారాష్ట్రలో భూకుంభకోణాల కలకలం

మహారాష్ట్రలో వరుసగా భూ కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి. మంత్రి ప్రతాప్ సర్ నాయక్ రూ.200 కోట్ల విలువైన భూమిని రూ. మూడు కోట్లకే దక్కించుకున్నారని కాంగ్రెస్ మరో తీవ్ర ఆరోపణ చేసింది.

11

కాయ్ రాజా కాయ్!

మొదటిపేజీ తరువాయి

యత్నిస్తున్నాయి. హైదరాబాద్‌లో సోషల్ మీడియా గ్రూపులలో ఈ విషయం ప్రధాన చర్చగా మారింది.

బెట్టింగ్ వేస్తున్నాం -గెలుపెవరిది?

తెలంగాణలో మాత్రమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ ఎన్నికపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన కొందరు బెట్టింగ్ రాయుళ్లు హైదరాబాద్‌లో ఉన్న తమ పరిచయస్తులను సంప్రదించి, అక్కడ గాలి ఎటు వీస్తోందో తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 'బెట్టింగ్ వేస్తున్నాం కచ్చితంగా ఎవరు గెలుస్తారో చెప్పు' అంటూ మీడియా, రాజకీయ వర్గాల మిత్రులను అడుగుతున్నట్టు సమాచారం. సర్వే సంస్థల అంచనాలు కూడా ఈ ఉత్కంఠను మరింత పెంచుతున్నాయి. ఒక్కో సంస్థ ఒక్కో విధంగా ఫలితాన్ని అంచనా వేస్తుండటంతో గెలుపు ఎవరిదో చెప్పడం కష్టంగా మారింది. బీఆర్ఎస్ గెలుస్తుందని కొన్ని సర్వేలు చెబుతుంటే, కాంగ్రెస్ పార్టీ తీరా ముందంజలో ఉందని మరికొన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయి. బీజేపీ ఓటు శాతం పెరుగుతోందని మరికొన్ని సర్వేలు సూచిస్తున్నాయి. ప్రచారానికి మరొక రోజే ఉండడంతో మూడు పార్టీలూ తమ బలగాలను రంగంలోకి దింపాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్టార్ క్యాంపెయినర్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లలో కూడా భారీ ప్రచారం కొనసాగుతోంది. అభ్యర్థుల వ్యక్తిత్వం, స్థానిక అభివృద్ధి వాగ్దానాలు, ప్రభుత్వ పథకాల ప్రభావం అన్నీ కలిసి ఫలితాన్ని నిర్ణయిస్తాయి.మొత్తానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాలలో మరొక ఉత్కంఠ భరిత పోటీగా నిలువబోతోంది.

సీఎం తన భాషను మార్చుకోవాలి

మొదటిపేజీ తరువాయి

ప్రదర్శించడం తగునా? అని ప్రశ్నించారు.

బకాయిలు
మాత్రం తీర్చడం లేదు

'కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తారు కానీ, కాలేజీ యాజమాన్యాల బకాయిలు మాత్రం తీర్చడం లేదు. విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి రావడంతో కాలేజీలు బంద్ చేశారు. , ప్రభుత్వం నుంచి వచ్చిన బెదిరింపులు అసహనకరంగా ఉన్నాయి' అని కవిత అన్నారు. 'యాజమాన్యాలు విద్యార్థుల కోసం నిలబడ్డారు. బెదిరించడం, అవమానించడం సరికాదు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పూర్తిగా చెల్లించి, విద్యార్థులపై వివక్ష లేకుండా చూడాలి. అవసరమైతే జాగృతి తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కవిత వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాలను సందర్శించారు. సమ్మయ్యనగర్, పరిసర ప్రాంతాలలో మునిగిన ఇళ్లను పరిశీలించారు. తాజాగా వరదల వల్ల ఇళ్లను కోల్పోయిన కుటుంబాల పరిస్థితిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం సీఎం వచ్చి ప్రజలకు హామీలు ఇచ్చినా, ఒక్క హామీ కూడా అమలులోకి రాలేదని విమర్శించారు. లోతట్టు ప్రాంతాలలో 25 యేండ్లుగా గుడిసెలలో ఉంటున్న కుటుంబాలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. రామన్నపేట లాంటి ప్రాంతాలు కూడా మునిగాయన్నారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన విపత్తు అని ఆమె ఘాటుగా విమర్శించారు. ఆ తరువాత కవిత ఎంజీఎం హాస్పిటల్‌ను సందర్శించి రోగులతో మాట్లాడారు. కలిసారు. నర్సన్నపేట, పరకాలలోనూ కవిత పర్యటించారు.

చాయ్ పే చర్చ

కవిత శనివారం రాత్రి కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డులో విద్యార్థులతో కలిసి చాయ్ తాగి, వారి సమస్యలు, ఉద్యోగ నోటిఫికేషన్లు, జోనల్ వ్యవస్థ అంశాలపై చర్చించారు. విద్యార్థులు, గత ప్రభుత్వం నోటిఫికేషన్లు వేయకుండా మోసం చేసినట్లు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో అధికార మార్పు అవసరమని అన్నారు. తన రాజకీయ భవిష్యత్ కన్నా ప్రజలకు మంచి జరగడం ప్రధాన లక్ష్యం అని, విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యలపై కచ్చితంగా పోరాటం చేస్తారని హామీ ఇచ్చారు.

డిసెంబర్ 1 నుంచి
పార్లమెంటు సమావేశాలు

మొదటిపేజీ తరువాయి

నిర్వహించాలనుకుంటున్నామని మంత్రి వివరించారు. కానీ, పార్లమెంట్ శీతాకాల సమావేశాలను కేంద్రం అసాధారణంగా ఆలస్యం చేసిందని, రోజులను కుదించిందని కాంగ్రెస్ పేర్కొంది. ప్రభుత్వానికి లావాదేవీలు చేయాల్సిన పని లేదని, బిల్లులు ఆమోదించాల్సిన అవసరం లేదని, చర్చలు అనుమతించాల్సిన అవసరం లేదేమోనని కూడా వ్యాఖ్యానించింది. ఈ సంవత్సరం శీతాకాల సమావేశాలు కేవలం 15 రోజులే ఉంటాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. దీని ద్వారా దేవానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. నిరుడు శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకు జరిగాయి. జూలై 21న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఒక రోజు ముందుగా ఆగస్టు 21వ తేదీన ముగిశాయి. లోక్‌సభ, రాజ్యసభ రెండు కూడా నిరవధికంగా వాయిదా పడ్డాయి.

ఊరంతా నాటు కోడి పులుసే!

మొదటిపేజీ తరువాయి

పొలాలలో వీటిని విడిచిపెట్టారు. దీంతో నాటు కోళ్లను తెచ్చుకోవడం కోసం జనం ఎగబడ్డారు. అందినకాడికి దొరకబట్టుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. అయితే, ఇంత పెద్దఎత్తున నాటు కోళ్లను ఎవరు, ఎందుకు వదిలిపెట్టారో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గ్రామస్తులు ఈ కోళ్లను చూసి సంతోషించి, తమకు కావలసినన్ని కోళ్లను పట్టుకున్నారు. మార్కెట్ లో నాటు కోడి మాంసం కావాలంటే, మటన్ తో సమానంగా రేటు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఆ కూరకు అంత క్రేజ్ మరి. అయితే, హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో వింత ఘటన చోటు చేసుకుంది. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రెండు వేలకు పైగా నాటుకోళ్లను వదిలి వెళ్లిపోయారు. అయితే, ఆ కోళ్లన్నీ సమీపంలో ఉన్న పొలాలలోకి మేతకు వెళ్లాయి. దీంతో గమనించిన రైతులు అవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయని ఆరా తీయగా, ఎవరో రోడ్డుపై వదిలి వెళ్లినట్లు గుర్తించారు. ఇంకేముంది వాటిని ఎంచక్కా పట్టుకుని ఇళ్లకు తీసుకెళ్తున్నారు.. విషయం ఈ నోట, ఆ నోట పాకడంతో ఎల్కతుర్తి గ్రామస్తులు నాటు కోళ్ల వేటలో నిమగ్నమై, ఒక్కొక్కరు నాలుగు, ఐదు చొప్పున కోళ్లను పట్టి ఇళ్లకు తీసుకెళ్లారు. దీంతో ఎల్కతుర్తిలో ఇవాళ నాటుకోడి చికెన్ పండుగే అని చర్చ జరుగుతున్నది, కానీ, వైద్యాధికారులు మాత్రం ఆ నాటు కోళ్లను తినవద్దని హెచ్చరించారు. బహుశా వాటికి రోగం ఏదైనా సోకిందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. వాటిని పరీక్షలకు పంపించామని కూడా వెల్లడించారు.



14 తర్వాత రాష్ట్రంలో పెను తుఫాను

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ అమలు చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు. అభివృద్ధి అంటూ కాంగ్రెస్ చెబుతున్న మాటలన్నీ అబద్ధమని ఎద్దేవా చేశారు. ఒక్కసారి ఓటేసిన పాపానికి ప్రజలు ఎన్నో బాధలు పడుతున్నారని అన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేశారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మి రూ. లక్ష ఇచ్చారని, ప్రభుత్వ ఆస్పత్రిలో మగబిడ్డ పుడితే రూ.12 వేలు, ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు అందించామని చెప్పారు. అభివృద్ధిలోనూ తెలంగాణను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్‌దేనని కేటీఆర్ స్పష్టం చేశారు. యాపిల్, గూగుల్, అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు నగరానికి వచ్చాయని, వాటి ద్వారా లక్షల సంఖ్యలో ఐటీ జాబ్‌లు పెరిగాయని చెప్పారు. ఒక్క హైదరాబాద్‌లోనే పేదల కోసం లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించామని అన్నారు.

రెండేండ్లలో సర్వనాశనం

కానీ, కాంగ్రెస్ వచ్చిన రెండేండ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. రియల్ ఎస్టేట్‌తో పాటు హోటళ్లు, చిన్న చిన్న వ్యాపారాలు పడిపోయాయన్నారు. కాంగ్రెస్ నిర్వాకంతో అన్నల పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పారు. గతంలో రెండు వేలు వచ్చే ఆదాయం వెయ్యికి పడిపోయిందని తెలిపారు. దీనితో ఎంతో మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. మహిళలకు తులం బంగారం ఇస్తామని, మెడలో ఉన్న గొలుసులు కూడా లాక్కుంటున్నారని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించడమే వీటన్నింటికి పరిష్కారమని అన్నారు. హిట్లర్ వంటి నియంతకు కూడా పతనం తప్పలేదని, రేవంత్ ఒక లెక్కా అని ఫైరయ్యారు. ఇప్పుడు కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికలో కారు గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.



"బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోయాయని రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రేవంత్ వ్యక్తిగత విమర్శలకు దిగినా భయపడను. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఆయన సర్టిఫికెట్ నాకు అవసరం లేదు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ఏం చేసిందో నాకు తెలుసు. రూ.లక్ష కోట్ల అవినీతిని బయట పెడతామని రాహుల్, రేవంత్ చెప్పి రూ.లక్ష కూడా వెలికితీయలేదు.

- జూబ్లీహిల్స్ ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

- ప్రధాని మోడీ, కేంద్ర మంత్రుల శుభాకాంక్షలు
- స్వయంగా ఫోన్ చేసిన రాహుల్, ఏఐసీసీ నేతలు
- రాష్ట్ర వ్యాప్తంగా భారీగా సీఎం జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, ఏఐసీసీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు భారీ ఎత్తున కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిరుపేదలకు అన్నదానం చేశారు. ప్రముఖ సైకత శిల్పి వరప్రసాద్ హుస్సేన్ సాగర్ తీరాన రేవంత్‌రెడ్డి సైకత శిల్పాన్ని రూపొందించారు. యాదగిరిగుట్ట పండితులు సీఎంను ఆశీర్వదించారు. పార్టీ నేతలు, మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు సీఎం నివాసానికి చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీఎం సోదరుడి కూతురు వివాహానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎంకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ ప్రసాద్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు స్పీకర్ పలువురు కాంగ్రెస్ పార్టీ సీఎంలు ఆయనకు శుభాకాంక్షలు తెఇపారు.

57కిలోల కేక్ ...

ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఓయూ జాక్ ప్రత్యేకంగా తయారు చేయించిన 57 కిలోల కేక్ ను గడ్డి అన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. మహేశ్వరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. షాద్ నగర్ లో పార్టీ యువనేత కేకే కృష్ణ రూ.30 లక్షల వ్యయంతో నియోజకవర్గంలో 15 బస్సు షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. పరి గిరోడ్డులో బస్ షెల్టర్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు.



















పతాకస్థాయికి ప్రచారం

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం కృషి చేస్తుంటే అడ్డుకోవడానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేటీఆర్ కష్టపడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్ విషయంలో వారిద్దరు బ్యాడ్ బ్రదర్స్ అంటూ ధ్వజమెత్తారు. వారిద్దరి మూలంగానే చాలా కార్యక్రమాలు ఆగిపోయాయని, చివరకు కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసు, ఈ ఫార్ములా కేసు ముందుకు సాగడం లేదని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పని చేస్తున్నాయని నిత్యం తమ పనులకు కాలడ్డం పెట్టడమేవాళ్ల పని అన్నారు.

కేసీఆర్‌కు కిషన్ రెడ్డి గురుదక్షిణ

గతంలో కాంగ్రెస్ చేసిన పనులు, రెండేండ్లుగా తాము చేసిన పనులు, పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన పనులు బేరీజు వేసుకొని ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులను కేసీఆర్ కొనసాగించారే తప్ప హైదరాబాద్‌కు కొత్తగా చేసిందేమీ లేదని అన్నారు. మెట్రో నిర్మాణ విషయంలో ఎల్అండ్ టీ వద్ద కమీషన్లు కొట్టేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దాన్ని పూర్తిగా నష్టాలలోకి తీసుకెళ్లారని అన్నారు. ఇప్పుడు దాన్ని విస్తరించడానికి కేంద్రం మోకాలడ్డుతోందని విమర్శించారు. వారు ఊహించని విధంగా ప్రభుత్వమే మెట్రోను కొనుగోలు చేసేసరికి వారికి ఏం చేయాలో అర్థం కావడం లేదని అన్నారు. తమ కమీషన్లు వచ్చే పనులు మాత్రం చేశారని వాటిపై విచారణకు ఆదేశిస్తే కేంద్రంలో కిషన్ రెడ్డి చక్రం తిప్పుతూ కేసులకు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. తన విజయానికి కారణమైన కేసీఆర్‌కు కిషన్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని ఫైర్ అయ్యారు. అందుకే బీఆర్ఎస్ విజయానికి కష్టపడుతున్నారని ఆరోపించారు.

ప్రతి ఎన్నిక ఒక పరీక్షే

రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నిక కూడా తమ పాలనకు పరీక్షగా రేవంత్ రెడ్డి చెప్పారు. విజయం సాధిస్తే మరింత ఉత్సాహంతో ప్రజలకు ఎలా మంచి చేయాలని ఆలోచిస్తామని అన్నారు. ఓడిపోతే కచ్చితంగా జరిగిన తప్పులను సరి చేసుకొని ముందుకెళ్తామని అన్నారు. ఓడినా గెలిచినా ప్రభుత్వానికి వచ్చిన ప్రమాదం లేదని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షాలు చేస్తున్న సవాళ్లకు స్పందించి సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఓడిపోతే ఏం చేస్తారో ప్రతిపక్షాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి లోపాయికారి ఒప్పందం తెలిసి కూడా బండి సంజయ్ లాంటి వాళ్లు కష్టపడుతున్నారని, వారిని చూస్తే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. కాగా, జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ఓ రెఫరెండంగా తీసుకునేందుకు వెనుకాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యాండ్సప్ చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వివిధ ప్రాంతాలలో ప్రచారం నిర్వహించిన ఆయన రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ రెండేళ్ల పాలన చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని సవాల్ చేశారు. అంతేకానీ, గతాన్ని గుర్తు చేసి అటెన్షన్ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.

రెండేండ్లలో చేసిందేంటీ

రెండేండ్లలో చేసింది ఏం లేదు కాబట్టే సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను బెదిరించి ఓట్లు అడుగుతున్నారని కేటీఆర్ అన్నారు. తనకు సంబంధం లేని కాంగ్రెస్ పాలన గురించి నేడు ప్రస్తావిస్తున్నారంటే వారి ఓటమి ఖాయమైందని గ్రహించారని ఎద్దేవా చేశారు. రెండేండ్లలో అన్ని వర్గాలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా మోసం చేసిన వ్యక్తికి ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వాలో ప్రజలకు బాగా తెలుసని అన్నారు. గెలిస్తే అభివృద్ధి చేస్తామని గతంలో కంటోన్మెంట్‌లో చెప్పి విజయం సాధించారని, ఇప్పుడు అక్కడ ఏం చేశారో వివరించాలని డిమాండ్ చేశారు. ఎవరి హయాంలో హైదరాబాద్‌కు రోడ్లు, ఫ్లైఓవర్‌లు, ఓవర్ బ్రిడ్జ్‌లు సహా వివిధ అంతర్జాతీయ సంస్థలు వచ్చాయో ప్రజలకు బాగా తెలుసని తెలిపారు. హైడ్రా గురించి గొప్పగా చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి దాని కారణంగానే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దల జోలికి వెళ్లని హైడ్రా కేవలం పేదల ఇళ్లను మాత్రమే కూలుస్తోందని వారిని రోడ్డు పడేస్తోందని మండిపడ్డారు.

మాట తప్పడం రేవంత్ రెడ్డి నైజం

- ప్రజలకు పనికొచ్చే ఒక్క పని చేయరు
- అంబేడ్కర్ పేరుందని సెక్రెటేరియట్‌కి పోవడం లేదు
- తీవ్రంగా మండిపడిన మాజీ మంత్రి హరీశ్ రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8: ఫీజు రీయింబర్సుమెంటుపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. సీఎం తీరు 'దొంగే దొంగ' అన్నట్టుగా ఉందని విమర్శించారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డిదీ 'ఫెవికాల్ బంధం' అన్నారు. 'ఓటుకు నోటు కేసులో ఈడీ విచారణ ఎందుకు జరగడం లేదు? బిహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారని ఢిల్లీలో భట్టి విక్రమార్క ఇంటిలో ఐటీ దాడులు జరిగాయి. పొంగులేటి ఇంటిలోనూ దాడులు జరిగితే ఎందుకు చెప్పలేదు? ఈడీ ఎందుకు మౌనంగా ఉంది? వారికి బీజేపీతో చీకటి ఒప్పందాలు ఉన్నాయి. పీజేఆర్‌ను మానసికంగా వేధించి ఆయన చావుకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ' అని హరీశ్ మండి పడ్డారు. తెలంగాణ భవన్ లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి మాట్లాడారు. సీఎం గంటన్నర సేపు చేసిన ప్రెస్ మీట్ చూసినవారికీ ఆయన మానసిక స్థితిపై సందేహం కలుగుతుందన్నారు. జూబ్లీహిల్స్‌లో ఎన్ని అడ్డదారులు తొక్కినా ఫలించకపోవడంతో ఆ ఫ్రస్ట్రేషన్‌లో ఆయన ఏదేదో మాట్లాడారని అన్నారు. ప్రభుత్వం నడపడం చేతకావడం లేదని ముఖ్యమంత్రి మాటలలో తేలిపోయిందన్నారు.

ఇది మిషన్ కాకతీయ ఫలితం

'2023లో 2.73 కోట్ల టన్నుల వరి ఉత్పత్తి వచ్చింది. ఇది మిషన్ కాకతీయ, 24 గంటల కరెంట్, ప్రాజెక్టుల ఫలితం. కాళేశ్వరం కూలిందని చెబుతున్న రేవంత్ మల్లన్నసాగర్ ద్వారా నీళ్లు తెస్తానని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నీ భాగాలు మేడిగడ్డ, కన్నెపల్లి, అన్నారం, మల్లన్నసాగర్, కొండపోచమ్మ ఇవన్నీ సజావుగా పనిచేస్తున్నాయి. రైతుల కళ్లల్లో ఆనందం ఉంది' అని హరీశ్ అన్నారు. 'అంబేడ్కర్ స్ఫూర్తితో సచివాలయం కట్టాము. అంబేడ్కర్ పేరు ఉండటం రేవంత్ రెడ్డికి నచ్చదు. అందుకే అక్కడికి పోడు. తెలంగాణ ప్రతిష్ఠను పెంచేలా బీఆర్ఎస్ ఆ సౌధం నిర్మించింది' అని హరీశ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ మోసం గుర్తించారని, ఇప్పుడు వారు చీరలు, డబ్బులు పంచినా జూబ్లీహిల్స్ ఓటర్లు తగిన బుద్ధి చెబుతారని హరీశ్ రావు అన్నారు.

సింగరేణి పెట్టుబడులకు 'ఘనా దేశం' ఆహ్వానం

- సానుకూలంగా స్పందించిన సింగరేణి యాజమాన్యం
- సింగరేణి విస్తరణలో శుభపరిణామం: సీఎండీ ఎన్.బలరామ్




ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : ప్రపంచంలోనే వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం తదితర ఉత్పత్తులకు ప్రముఖ దేశంగా పేర్కొనే 'రిపబ్లిక్ ఆఫ్ ఘనా' తమ దేశంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా సింగరేణి సంస్థకు ఆహ్వానం పలికింది. సింగరేణి భవన్ లో శనివారం ఘనా దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ తో సమావేశమై పలు వ్యాపార అంశాలపై చర్చించింది. తమ దేశం లో ఖనిజ రంగంలో పెట్టుబడులకు అవకాశం ఉందని, ఈ విషయంలో అపార అనుభవం గల సింగరేణి సంస్థకు తాము స్వాగతం పలుకుతున్నామన్నారు. తమ దేశంలో ప్రధానంగా వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్ , లిథియం వంటి ఖనిజాల తవ్వకం, ఉత్పత్తులు పెద్ద ఎత్తున జరుగుతుంటాయని, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటామని అన్నారు. ఉత్పత్తి పెంచడానికి ఇందుకు అవసరమైన పెట్టుబడులను ఆహ్వానించడం కోసం వచ్చామని చెప్పారు. సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ విదేశాలలో గనుల రంగాలలో కూడా ప్రవేశించాలని ఇప్పటికే నిర్ణయించామన్నారు. ఘనాలోనూ మైనింగ్ జరపటానికి గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, జీఎం టి.శ్రీనివాస్, ఘనా దేశ ప్రతినిధి బృందంలో బిజినెస్ కన్సల్టెంట్ అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బోటు, మాలి దేశ రాయబారి అహ్మద్ ఉమర్ సాండా, ఘనా దేశ అధ్యక్షుడు జాన్ సోదరులు పాల్గొన్నారు



తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే మా అజెండా

- ప్రతి అడుగు భావితరాల భవిష్యత్తు కోసమే
- కాంగ్రెస్ ను ఆదరించాలని మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే తమ ప్రభుత్వ 'అజెండా' అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఉప ఎన్నికలో లబ్ది పొందేందుకే బీఆర్ఎస్, బీజేపీ తమపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా శనివారం ఆయన శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డి గూడ పలు కాలనీలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ రెండేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ పాలనలో దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. తాము వేసే ప్రతి అడుగు భావితరాల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసమేనని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని, ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురయ్యిందన్నారు. చాలా కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారో నిలదీయాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. సదా అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న నవీన్ యాదవ్ ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే, ఇక్కడి ప్రజలకు, నియోజకవర్గానికి మేలు జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియోజకవర్గం అభివృద్ధికి అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి మనిషి నవీన్ ను గెలిపించండి

- 'జూబ్లీ' ఓటర్లకు పార్టీ నేత జగ్గారెడ్డి వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో ఇంటి మనిషి 'నవీన్ యాదవ్ ను గెలిపించుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాబోయే మూడేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. ఆ మూడేళ్లు జూబ్లీహిల్స్ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలంటే నవీన్ యాదవ్ ను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. 'నవీన్ యాదవ్ ను గెలిపిస్తే ఇంటోడవుతాడు, ప్రతిపక్ష అభ్యర్థి ని గెలిపిస్తే పాలోడవుతాడని' సూచించారు. సీఎం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు అన్నీ నెరవేరుతాయన్నారు. ప్రతిపక్ష అభ్యర్థి గెలిస్తే ధర్నాలు, రాస్తారోకోలకు పరిమితమవుతాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పై సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను జూబ్లీహిల్స్ ఓటర్లు నమ్మొద్దని కోరారు. కేసీఆర్ వారసత్వాన్ని తీసుకునేందుకు కేటీఆర్ ఉప ఎన్నికను తన రాజకీయ ఉనికి కోసం వాడుకుంటున్నాడని ఆరోపించారు.

ఒప్పంద కార్మికులకు రూ.50 లక్షల ప్రమాద బీమా

- ఉద్యోగుల సహజ మరణానికి 20 లక్షల బీమా
- ప్రధాన బ్యాంకులకు సింగరేణి సీఎండీ బలరామ్ విజ్ఞప్తి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : రాష్ట్రప్రభుత్వ సూచన మేరకు సింగరేణిలో ఉద్యోగులు, ఒప్పంద కార్మికుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల సహకారంతో దేశంలోనే తొలిసారిగా ప్రారంభించిన ఉచిత ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఈ పథకాన్ని తమ సంస్థలో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ఈ పథకాన్ని మొట్టమొదటగా సింగరేణిలో ప్రారంభించడంలో సహకారం అందించిన బ్యాంకుల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సింగరేణి భవన్ లో ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా సింగరేణి ఉద్యోగులకు గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు, పొరుగు సేవల సిబ్బందికి రూ.40 లక్షల వరకు బీమా అందించడం సంతోషకరమని అన్నారు. ఇప్పటి వరకు వివిధ ప్రమాదాల్లో మరణించిన 34 మందికి దాదాపు రూ.30 కోట్ల బీమా సొమ్మును బ్యాంకుల ద్వారా అందించాం. ఇది వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించింది" అని అన్నారు. అయితే ఒప్పంద కార్మికులకు కనీసం రూ.50 లక్షల ప్రమాద బీమా అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సింగరేణి ఉద్యోగులు ఒక వేళ సహజ మరణంతో చనిపోతే కనీసం 20 లక్షల టర్మ్ ఇన్సురెన్స్ ఇచ్చే విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. కొనసాగించేందుకు మెరుగైన ప్యాకేజీని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కొరకు ఓటును ఉపయోగించుకోవాలి

- 'జూబ్లీ' ఓటర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ వినతి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : జూబ్లీహిల్స్ ప్రజలు ఈ ఉప ఎన్నికను జూబ్లీహిల్స్ అభివృద్ధి కొరకు ఉపయోగించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, జూబ్లీహిల్స్ అభివృద్ధి చేసుకోవడానికి మంచి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమన్నారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికలో అభివృద్ధి కి పట్టం కట్టి కాంగ్రెస్ ను గెలిపించారన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్థానికుడు, యువకుడు, విద్యావంతుడు నవీన్ యాదవ్ కు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. నవంబర్ 11 వ తేదీన జరిగే ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ కోసం ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రభుత్వం సెలవు ప్రకటించిందని వెల్లడించారు. ప్రతి ఓటరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'జూబ్లీహిల్స్'లో ఆ రెండు రోజులు 144 సెక్షన్

- 11, 14వ తేదీలలో అమలులో ఉంటుందన్న నగర సీపీ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : ఉప ఎన్నిక సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో పోలీసు శాఖ పలు ఆంక్షలు విధించింది. రెండు రోజులు సెక్షన్ 144 అమలులో ఉంటుందని వెల్లడించింది. ఈ మేరకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ జరిగే 11న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ పూర్తయ్యే ఈ అదేశాలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఫలితం వెల్లడించే 14న ఉదయం 6 గంటల నుంచి, 15న ఉదయం 6 గంటల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రజా శాంతి, శాంతి, ప్రశాంతతను కాపాడే ఉద్దేశంతోఈ ఆదేశాలను ఇచ్చినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సందర్భంగా రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో టపాసులు పేల్చడం, టపాసులు విసరడం నిషేధమన్నారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించిన ఏ వ్యక్తి అయినా ప్రాసిక్యూషన్‌కు గురవుతారని హెచ్చరించారు.




'కాంగ్రెస్' లౌకికవాద పునాదులపై ఏర్పడింది

- నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం
- క్రైస్తవ సమాజానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : కాంగ్రెస్ పార్టీ లౌకికవాద పునాదుల మీద ఏర్పడిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలని వృద్ధిలోకి తీసుకురావడం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. సమాజం కోసం పని చేస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడం కోసం క్రైస్తవ ప్రతినిధులు సమావేశం కావడం శుభ పరిణామమని అన్నారు. పేదరికంలో ఉన్న ప్రతి వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదగడం కోసం, వారిని ముందుకు నడిపించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను పెద్ద మెజారిటీతో గెలిపించవలసిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రార్థనా మందిరాలలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి నాయకత్వంలోని ఈ క్యాబినెట్ మొత్తం కట్టుబడి ఉందన్నారు. సమాజం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, అరచేతుల్లో పెట్టి రక్షించుకోవాల్సిన కర్తవ్యం అందరి పైన ఉందన్నారు.





సీఎం సోదరుడి కూతురి వివాహం

- శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : నగరంలోని హైటెక్స్ లో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి కుమార్తె రచనా రెడ్డి -అన్షుమాన్ రెడ్డి వివాహం ఘనంగా జరిగింది. వేడుకకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. మంత్రులు, పీసీసీ చీఫ్, హీరో బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, ఇతర ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

"



ఇది హిందూ, ముస్లింల మధ్య జరుగుతున్న వార్. మొలతాడు ఉన్నోళ్లకు, లేనోళ్లకు, బొట్టు పెట్టుకున్నోళ్లకు, పెట్టుకోనోళ్లకు మధ్య పోటీ. 80 శాతం ఉన్న హిందువులు గెలుస్తారా? 20 శాతం ఉన్న ముస్లింలా? హిందువుల పక్షాన బీజేపీ, ముస్లింల వైపు కాంగ్రెస్‌ఉంది. తెలంగాణని ఇస్లామిక్ స్టేట్‌గా మార్చేందుకు రేవంత్ కుట్ర చేస్తున్నారు.

- జూబ్లీహిల్స్ ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

ఓపెన్ వాయిస్

రేవంత్ పాలనకు 'రెఫరెండమా'? ఎలా ?

సీదీ బాత్



ఎస్ కే జకీర్
9052631212

> అశువుగా చేస్తున్న ప్రసంగాలు
> రేవంత్ అత్యంత వేగంగా తీసుకునే నిర్ణయాలు, అశువుగా చేస్తున్న ప్రసంగాలు అందరినీ ఆకట్టుకుంటున్నవి. ఇంతటి క్రేజ్ వున్న మరొక నాయకుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో లేరు. తమకు కూడా అంతకన్నా సత్తా ఉందని ఎవరైనా అనుకుంటే ఆయా నాయకుల వాపు మాత్రమే! ఎన్నేళ్లుగా పార్టీలో ఉన్నామన్నది ముఖ్యం కాదు! పార్టీకి వారి వల్ల కలిగిన మేలు ఏమిటన్నది ముఖ్యం. ఆ చరిష్మా ఒక్క రేవంత్ రెడ్డికే సాధ్యమైంది. జూబ్లీహిల్స్ ఫలితం రేవంత్ ప్రభుత్వానికి రెఫరెండం అని నిర్ణయించుకుంటే, కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణ ప్రజలంతా రేవంత్ వైపు ఉన్నట్టు బీఆర్ఎస్ కూడా నిర్ధారణకు రావలసి ఉంటుంది.



'జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు రెఫరెండమే. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రజల కోపం బయటపడుతోంది. కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని రేవంత్ భయపడుతున్నారు. అసలు ఇప్పుడున్నది కల్తీ కాంగ్రెస్. బీజేపీతో కలిసి పనిచేస్తోంది. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కలిసి బీజేపీ అభ్యర్థిని బకరా చేస్తున్నారు. బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తుంది' అని కేటీఆర్ నవంబర్ ఆరున ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. 'ఈ ఎన్నిక తెలంగాణ ప్రజానీకానికి ఒక కనువిప్పు కూడా అవుతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో అధికార మార్పిడి జరగదు. కానీ, మేం కొట్లాడేది ఈ ఒక్క సీటు గెలవడం కోసం కాదు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు సీఎంగా ఉంటే తెలంగాణలో కాంగ్రెస్ మరో 15 యేండ్లు గెలిచే పరిస్థితి ఉండదు. మీడియా మేనేజ్‌మెంట్‌తో ఎన్నిరోజులు మభ్యపెడతారు. ప్రజలు తిప్పికొట్టబోతున్నారు. ఏ సీఎం కూడా తిరగనంతగా గల్లీలలో తిరిగి ప్రచారం చేస్తున్నారు' అని కూడా ఆయన చెప్పారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగే ఉపఎన్నిక ఫలితం తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజల అభిప్రాయంగా ఎలా పరిగణిస్తాం? మునుగోడు, హుజూరాబాద్, నాగార్జునసాగర్, దుబ్బాక, హుజూర్ నగర్, కంటోన్మెంటు వంటి నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు జరిగాయి. మరి, ఆయా ఎన్నికల సందర్భంగా 'రెఫరెండం' అనే మాట మాట్లాడిన దాఖలాలు లేవు. ఇప్పుడే ఎందుకీ సవాలు? ఎందుకీ హైప్? ఎందుకీ ఉత్కంఠ ? ఎందుకీ ఘర్షణ? ఎందుకీ ఉద్రిక్తత ? జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఇంత ఉష్ణోగ్రతకు కారణం బీఆర్ఎస్ పార్టీ. ఈ ఉద్రిక్తతలకు కారణం కేటీఆర్. ఈ ఉప ఎన్నికను కేసీఆర్ అత్యంత సీరియస్ గా తీసుకున్నారు.

ఇప్పటికీ సరైన సమీక్షలు లేవు

'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ వ్యూహాలు ఓ పట్టాన అంతుచిక్కవు. తలలు పండిన రాజకీయ నేతలకు కూడా అంతుచిక్కని రీతిలో కేసీఆర్ వ్యూహ రచన ఉంటుంది. కేసీఆర్ గేమ్ ప్లాన్ గొప్పగా ఉంటుంది' అని భావించే మనుషులు ఆ పార్టీలో కోకొల్లలు. కేసీఆర్ కనిపించకపోయినా, ఆయన దర్శన భాగ్యం లభించకపోయినా, చాలా కాలం పాటు ఆయన మౌనంగా ఉన్నా కేసీఆర్ ఏదో ప్లాన్ చేస్తున్నారని, కత్తికి పదునుబెడుతున్నారని అనుకునే అభిమానులకు అంతు లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా పాలించిన పదేండ్ల కాలంలో పార్టీ నేతలు,ఆయన సామాజికవర్గం ముఠాలు కేసీఆర్ ను కనిపించే దేవునిగా మార్చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో అనుసరించవలసిన వ్యూహంపై ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ లో సమీక్ష నిర్వహించిన సందర్భంగా పలువురు మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు,ఇతర ముఖ్యులు కూడా కేసీఆర్ చేతిని ముద్దాడారు. ఆయన కాలి ధూళిని కండ్లకు అద్దుకున్నవారూ ఉన్నారు. అక్టోబర్ 23 న జరిగిన సమీక్షలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఉన్న ప్రాముఖ్యత, దీన్ని గెలవడం వలన తెలంగాణవ్యాప్తంగా రాజకీయ బలాబలాలలో వచ్చే మార్పుల గురించి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి రాగల ముప్పు, బీఆర్ఎస్ వేగంగా పుంజుకునే అవకాశాలు వంటి అన్ని అంశాలపై పార్టీ నాయకులకు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హితబోధ చేశారు. కాగా, 2018లో తొమ్మిది నెలల ముందుగానే అసెంబ్లీని రద్దు చేసి కేసీఆర్ ముందస్తుకు వెళ్లడం, టీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలో గెలిచి రెండోసారి అధికారాన్ని దక్కించుకున్నది. అసెంబ్లీని రద్దు చేసి ముందస్తుకు వెళ్లే సమయానికి కేసీఆర్ 4 సంవత్సరాల 3 నెలల పాటు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్నారు.2023 ఎన్నికలలో ప్రజల తిరస్కారంపై ఇప్పటికీ సరయిన సమీక్ష, తప్పిదాలు సరిదిద్దుకోవాలన్న ఆలోచన కేసీఆర్ కు లేదు.





గెలుస్తామనే భారీ నమ్మకం

గత ఎన్నికలో మాగంటి గోపీనాథ్ 16 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారని, ఇప్పుడు అంతకన్నా ఎక్కువ మెజారిటీతో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని కేసీఆర్ అనుకుంటున్నారు. అసెంబ్లీలో ఓటమి,లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటూ గెలవకపోవడం వంటి అంశాల ప్రభావం జూబ్లీహిల్స్ పై ఎంత చూపుతుందో తెలియదు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పనిచేస్తున్నట్టు కేటీఆర్ ఆరోపిస్తున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు పెద్దగా వర్కవుట్ అయ్యేలా లేవు. 'అసలు ఇప్పుడున్నది కల్తీ కాంగ్రెస్, ఇదొక కాషాయ, పంచకూట కూటమి' అని ఆయన విమర్శించారు. బీజేపీ కూడా కాంగ్రెస్‌కు సహాయపడేందుకే జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తోందని, నిన్న మొన్నటి వరకు పత్తా లేని బండి సంజయ్ హిందూ, ముస్లిం అంటూ గావుకేకలు పెడుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎన్టీఆర్ అభిమానులు,టీడీపీ సానుభూతిపరులు,సెటిలర్లు,కమ్మ సామాజికవర్గం ఓటర్లు ఎటువైపు మొగ్గు జూపుతారో సస్పెన్సుగా ఉంది. తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకే వారంతా మద్దతుగా నిలుస్తారని కేటీఆర్ చెప్పారు. ఎన్టీఆర్, పీజేఆర్ ను వెనకేసుకొని వచ్చే విషయంలో సీఎం రేవంత్ రెడ్డి,కేటీఆర్ పోటీ పడుతున్నారు.కాంగ్రెస్ కు మజ్లిస్ మద్దతు ఉన్నా ముస్లింల ఓట్లలో అత్యధికం బీఆర్ఎస్ కు పడతాయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా వేదికగా

రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి పదవి చేబట్టిన నాటి నుంచి బీఆర్ఎస్ అధికారపక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. బీఆర్ఎస్ ను కాంగ్రెస్ పార్టీ కట్టడి చేయడంలో ఎందుకు విఫలమవుతోందన్న చర్చ జరుగుతోంది.'మనం ఇక అధికారంలోకి వచ్చేస్తున్నాం. ప్రజలు మళ్లీ మనకు పట్టం గట్టడానికి సిద్ధంగా ఉన్నారు' అని కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు 'మైండ్ గేమ్'లో భాగం. కానీ, జనంలోకి ఇలాంటి ప్రకటనలు అత్యంత వేగంగా సూటిగా వెడుతున్నవి. గ్రామీణ ప్రాంతాలలో, సోషల్ మీడియాను బీఆర్ఎస్ సమర్థంగా వాడుతున్నది. ప్రతి మారుమూల గ్రామంలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉన్న పరిస్థితిని సానుకూలంగా మలచుకున్న కేసీఆర్, కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై 'వ్యతిరేక' ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. బీఆర్ఎస్ కు సంబంధించిన యావత్తు సోషల్ మీడియా 'బలగాలు' కేటీఆర్, ఆయన నమ్మకస్థుల గుప్పిట పనిచేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'మచ్చ' తీసుకురావడానికి, ఆయన 'అసమర్ధ పాలకుడు' అనే ముద్ర వేయడానికి ప్రతిరోజూ ఒక కార్యాచరణ ప్రణాళికతో బీఆర్ఎస్ ముందుకు వెడుతోంది. ఇందులో భాగంగానే జూబ్లీహిల్స్ ఎన్నిక రేవంత్ పరిపాలనకు 'తీర్పు' గా కేటీఆర్ నిర్వచించారు.

అందరి మౌనానికి కారణమేమిటి?

తెలంగాణలో కాకలు తీరిన కాంగ్రెస్ నేతల కొరత ఏమీ లేదు. వారంతా తాత్సారంగా సినిమా చూస్తున్నట్లుగా ఎందుకు ఉండిపోతున్నారో తెలియదు. దుష్ప్రచారం పడగ విప్పి కరాళ నృత్యం చేస్తున్నా మంత్రులు బలంగా తిప్పి కొట్టలేకపోవడమేమిటో అర్థం కాదు. ప్రభుత్వ సలహాదారులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. ముఖ్యమంత్రిని, అటు ప్రభుత్వాన్ని, పార్టీని సొంతం చేసుకునే వారు లేకపోవడమే ఇందుకు కారణం. వైఎస్ రాజశేఖరరెడ్డి వలె రేవంత్ అత్యంత శక్తి సంపన్నుడు కాకపోయినా, ఒక్కసారి మంత్రిగా పని చేసిన అనుభవమూ లేకపోయినా తన సొంత తెలివితేటలు, వైవిధ్యంగా ఆలోచించే తత్వం, సృజనాత్మకంగా నిర్ణయాలు తీసుకునే వైఖరితో ముఖ్యమంత్రిగా మెరుపులు మెరిపిస్తున్నారు.'నాయకుడిని దెబ్బతీయాలంటే ముందుగా అతడిని ఏకాకిని చేయాలి' అనే యుద్ధనీతితో రేవంత్ ను బలహీనపరచేందుకు గాను కేసీఆర్, కేటీఆర్ దీర్ఘకాలిక ప్రణాళికను అమలుచేస్తున్నారు. రేవంత్ రెడ్డి సహచర మంత్రులలో 'ఒకరిద్దరి'ని లోబరచుకునే ప్రయత్నాలను వేగవంతం చేశారని, యేడాదికాలంగా సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నవి. రేవంత్ కాంగ్రెస్ పార్టీకి 'పరాయి మనిషి' అని, కేటీఆర్, హరీశ్ రావు నిందించడం, ఆ మనిషి అసలు కాంగ్రెస్ నాయకులను తొక్కుకుంటూ సీఎం పదవి చేబట్టారని వ్యాఖ్యలు చేస్తుండడం 'ముఖ్యమంత్రిని ముఖ్యమంత్రిగా గుర్తించకండి, గౌరవించకండి' అనే సందేశం ఇచ్చే ప్రయత్నమే. ముఖ్యమంత్రి కావాలన్న జీవితాశయం ఎవరికుండదు? అయితే అందరూ ఆ పదవిని అందుకోలేరు. శక్తి సామర్థ్యాలు, సొంత మేధస్సు, పది మందిని తన అనుచరులుగా మార్చుకోగలగడం, తమకు విధేయులను కూడగట్టుకోవడం, అంగబలాన్ని సమకూర్చుకోవడం, చాకచక్యం, చాణక్యం, జనాకర్షణ, కార్యకర్తల ఫాలోయింగ్, చేతికి ఎముక లేనట్టుగా డబ్బు ఖర్చు చేయడం వంటి అనేక లక్షణాలతో పాటు అదృష్టమూ ఉండాలని సీనియర్ రాజకీయ నాయకులంటుంటారు.

సీఎం రేవంత్ కు మద్దతు కరువు

అధికారపక్షం కాంగ్రెస్ లో పరిస్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నది. పీసీసీ అధ్యక్షుడు సహా, కొందరు సీనియర్ మంత్రులు కూడా తాము కూడా ముఖ్యమంత్రులమనే వైఖరితో పనిచేస్తున్నట్టు విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. పదేండ్ల తర్వాత అతికష్టమ్మీద అనూహ్య విజయాన్ని సాధించడానికి కీలక భూమిక పోషించిన రేవంత్ రెడ్డికి పార్టీలో, అధికార వర్గాలలో మద్దతు లేకపోవడం ఒక విషాదం. బీఆర్ఎస్ హయాంలో ఒక వెలుగు వెలిగిన 'కళంకిత' ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మైనస్ పాయింటుగా రేవంత్ శ్రేయోభిలాషులంటున్నారు. కొందరు అధికారులు ఇప్పటికీ కేటీఆర్, హరీశ్ రావుకు నమ్మకస్తులుగా పనిచేస్తున్నట్టు తరచూ కథనాలు వస్తున్నాయి. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తున్నారంటూ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్ 'వ్యూహాత్మక' ప్రచారం సాగిస్తున్నది. కేసీఆర్ హయాంలో ఇబ్బడిముబ్బడిగా లబ్ధి పొందిన ఉన్నతాధికారులు కొన్ని యూట్యూబ్ చానళ్ల, టీవీ న్యూస్ చానళ్ల సీఈఓ లేదా ఎడిటర్ కు ఫోన్ చేసి రేవంత్ రెడ్డికి అనుకూలంగా ప్రసారాలు చేయవద్దు. కేసీఆర్ అధికారంలోకి రాగానే మీరు ఇబ్బందులకు గురవుతారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని చెబుతున్నట్టుగానూ గతంలో ఒక ప్రచారం సాగింది. ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతోంది. జనం కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని బీఆర్ఎస్ పకడ్బందీగా ప్రాపగాండా చేస్తోంది. కేసీఆర్ హయాంలో అనేక విధాలుగా లబ్ధి పొందిన వారంతా, గతంలో కనబరచిన విధేయతను ఇంకా ప్రదర్శిస్తూనే ఉన్నట్టు తెలుస్తోంది. మీడియా,ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తదితర వర్గాలను సంతృప్తి పరచారని కేసీఆర్, కేటీఆర్ పట్ల అదే 'భక్తి'ని చాటుకుంటున్నట్టు తెలియవచ్చింది.

టీడీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చి

టీడీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చోవడం వరకు రేవంత్ రెడ్డి ప్రతి కార్యక్రమం సంచలనం. జనంలో విపరీత క్రేజ్ పెరిగింది! ఎవరూ ఊహించని రీతిలో పదేండ్ల ఏకఛత్రాధిపత్యం సాగించిన కేసీఆర్ ను ఫామ్ హౌస్ కే పరిమితం చేయడం మరో సంచలనం. అధికారం చేపట్టాక కూడా రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కేసీఆర్ భాషలోనే కేసీఆర్ ను ఢీ కొంటున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికను తేలికగా తీసుకోకుండా తానే సర్వస్వమై ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన రోడ్ షో వల్లనే కాంగ్రెస్ పార్టీ బాగా పుంజుకుంది. కేసీఆర్ హయాంలో బిల్డర్లు, పెట్టుబడిదారులు, వ్యాపారులు, కొనుగోలుదారులు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కు అయి ఇష్టం వచ్చినట్లు చెరువులు ఆక్రమించి అపార్టుమెంట్లు,విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలను నిర్మించి పరిస్థితి అస్తవ్యస్తం చేశారు. వెనుక ముందు చూడకుండా నిబంధనలను గుడ్డిగా తొక్కిపెట్టి అక్రమ లే అవుట్లకు అనుమతి ఇచ్చిన అధికారులు, ప్రభుత్వ రాజకీయ పెద్దలు అందరూ దోషులే. అభివృద్ధి పేరిట హైదరాబాద్ ను మహా నగరంగా మార్చి నాశనం చేసిన పాపం తలా పిడికెడు. ఇన్నాళ్ల తరువాత మొనగాడుగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన రేవంత్ హైడ్రా వ్యవస్థ ఏర్పాటు చేసి భూ ఆ క్రమణదారుల భారతం పడుతుండడంతో బీఆర్ఎస్ కు దిగులుగా ఉన్నది.

అశువుగా చేస్తున్న ప్రసంగాలు

రేవంత్ అత్యంత వేగంగా తీసుకునే నిర్ణయాలు, అశువుగా చేస్తున్న ప్రసంగాలు అందరినీ ఆకట్టుకుంటున్నవి. ఇంతటి క్రేజ్ వున్న మరొక నాయకుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో లేరు. తమకు కూడా అంతకన్నా సత్తా ఉందని ఎవరైనా అనుకుంటే ఆయా నాయకుల వాపు మాత్రమే! ఎన్నేళ్లుగా పార్టీలో ఉన్నామన్నది ముఖ్యం కాదు! పార్టీకి వారి వల్ల కలిగిన మేలు ఏమిటన్నది ముఖ్యం. ఆ చరిష్మా ఒక్క రేవంత్ రెడ్డికే సాధ్యమైంది. జూబ్లీహిల్స్ ఫలితం రేవంత్ ప్రభుత్వానికి రెఫరెండం అని నిర్ణయించుకుంటే, కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణ ప్రజలంతా రేవంత్ వైపు ఉన్నట్టు బీఆర్ఎస్ కూడా నిర్ధారణకు రావలసి ఉంటుంది.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

ఆత్మగౌరవ పతాక డా.ముహమ్మద్ ఇక్బాల్



ఎండీ ఉబైద్ ఖాన్
6305414351

భారత ఉపఖండ సాహితీ చరిత్రలో ఉర్దూ, ఫార్సీ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అతి కొద్ది మంది కవులలో అల్లామా డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ ప్రథములు. ఆయన రాసిన 'సారే జహాసె అచ్చా, హిందూసితా హమారా' దేశభక్తిగీతం నేటికీ భారతీయుల హృదయాలను పరవశింపజేస్తూ, దేశభక్తిని, దేశంపట్ల ప్రేమను ఉద్దీపింపజేస్తున్నది. అల్లామా అని బిరుదాంకితుడైన డాక్టర్ ఇక్బాల్ ప్రఖ్యాత కవి, రచయిత, తత్వవేత్త, సమర యోధుడు, రాజకీయ నాయకుడు. అల్లామా అంటే మహా కవి, మహా పండితుడు అని అర్థం. 1877, నవంబర్ 9 వ తేదీన బ్రిటిష్ ఇండియాలోని సియాల్ కోట్ లో జన్మించారు. తండ్రి షేఖ్ నూర్ ముహమ్మద్, చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగి. తరువాతి క్రమంలో సొంత వ్యాపారం ప్రారంభించాడు. తల్లి ఇమామ్ బీబీ. తల్లి తండ్రులిద్దరూచాలా భక్తిపరులు. నిర్మల మనస్సు కలిగిన ధార్మిక వ్యక్తులు. అతి సాధారణ జీవితానికి అంకితమైనవారు. ఉర్దూ, ఫార్సీ భాషా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి డాక్టర్ ఇక్బాల్ ఆధునిక తాత్విక ఆలోచనాపరులు. ఇక్బాల్‌ను 'షాయిరె మష్రిఖ్' అని కూడా అంటారు. అంటే పాశ్చాత్య కవి అని అర్థం. ఆయన్ని 'ముఫాకిరె పాకిస్తాన్' అనీ, 'హకీముల్ ఉమ్మత్' అని కూడా పిలుస్తారు. ఇరాన్, ఆఫ్ఘానిస్తాన్‌లో లాహోరీ ఇక్బాల్ గా ప్రసిద్ధి చెందారు. ఫార్సీ సాహిత్యంలో ఇక్బాల్ చేసిన కృషి బహుదా ప్రశంసనీయం. పాకిస్తాన్ ప్రభుత్వం ఆయన్ని జాతీయ కవిగా గుర్తించింది.

విభిన్న సాహితీ ప్రక్రియలలో


విభిన్న సాహితీ ప్రక్రియలలో డాక్టర్ ఇక్బాల్ కవిత్వం, కథలు రాశారు. ఆయన మొదటి కవితా సంపుటి అస్రారె ఖుదీ 1915 లో ఫార్సీ భాషలోనే వెలువడింది. ఇతర కవితా సంపుటాలలో రమూజె బేఖుదీ, పయామె మష్రిఖ్ , జబూరె అజం ఉన్నాయి. ఆయన ప్రసిద్ధ ఉర్దూ రచనలలో బాంగె దరా, బాలె జిబ్రీల్, జర్ బె కలీమ్ , ఆర్మగానె హిజాజ్ తదితర గ్రంధాలు ప్రముఖమైనవి. షిక్వ, జవాబె షిక్వ పద్య రచనకూడా అత్యంత ప్రసిద్ధమైనది. లాహోర్ ప్రభుత్వ కళాశాల తత్వశాస్త్ర అధ్యాపకుడు సర్ థామస్ ఆర్నాల్డ్ బోధనల ప్రభావం డాక్టర్ ఇక్బాల్ పై చాలా ఉంది. ఆర్నాల్డ్ బోధనల ప్రభావంతోనే పశ్చిమ దేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయించుకున్న ఇక్బాల్ 1905 లో ఇంగ్లాండుకు వెళ్లారు. కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కళాశాల నుండి స్కాలర్‌షిప్ కు అర్హత సాధించారు. 1906 లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌డిగ్రీ పొందారు. అదే సంవత్సరం లింకన్స్ ఇన్ నుండి బారిస్టర్ అయ్యారు. 1907లో డాక్టరేట్ చదవడానికి జర్మనీకి వెళ్లారు. 1908 లో మ్యూనిచ్‌లోని లుడ్విగ్ మాక్స్ మిలియన్ విశ్వవిద్యాలయం నుండి పీహెచ్డీ పట్టా పొందారు. ఫ్రెడరిక్ హోమెల్ మార్గదర్శకత్వంలో పని చేస్తూ, డాక్టర్ ఇక్బాల్ 1908 లో 'ది డెవలప్‌మెంట్ ఆఫ్ మెటాఫిజిక్స్ ఇన్ పర్షియా' పేరుతో తన డాక్టరేట్ థీసిస్ ను ప్రచురించారు. ఐరోపాలో చదువుతున్నప్పుడే ఫార్సీ భాషలో చిక్కని కవిత్వం రాయడం ప్రారంభించిన ఇక్బాల్, తన ఆలోచనల ధారను సులభంగా ప్రతిబింబింపజేయడానికి కవిత్వమే సరైన మాధ్యమమని భావించారు. 1899 లో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పూర్తి చేసిన తర్వాత, ఓరియంటల్ కాలేజీలో అరబిక్ రీడర్‌గా వృత్తిని ప్రారంభించారు.

తత్వశాస్త్రం బోధించడానికి

లాహోర్ ప్రభుత్వ కళాశాలలో తత్వశాస్త్రం బోధించడానికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. 1905 లో ఇంగ్లాండు వెళ్లే వరకు అక్కడే పనిచేశారు.1908లో ఇంగ్లండ్ నుండి తిరిగి వచ్చి మళ్లీ అదే కళాశాలలో తత్వశాస్త్రం, ఆంగ్ల సాహిత్య ప్రొఫెసర్‌గా చేరారు. ఫ్రెడరిక్ నీట్జే, హెన్రీ బెర్గ సన్ , గోథే వంటి పాశ్చాత్య తత్వవేత్తల ప్రభావం కూడా ఇక్బాల్ పై అమితంగా ఉంది. మౌలానా రూమీ కవిత్వం , తత్వశాస్త్రం ఇక్బాల్ మనస్సుపై లోతైన ప్రభావాన్ని చూపాయి. చిన్నతనం నుండి ధార్మిక భావాలు కలిగిన ఇక్బాల్ ఇస్లాం అధ్యయనం, ఇస్లామీయ నాగరికత, సంస్కృతి, చరిత్ర, రాజకీయం తదితర అంశాలపై దృష్టి పెట్టారు. 1935 లో డాక్టర్ ఇక్బాల్ సూచన మేరకు, సయ్యద్ నజీర్ నియాజీ, డాక్టర్ ఇక్బాల్ రచించిన 'తులూయె ఇస్లాం' మకుటంతో ఒక పత్రికను ప్రారంభించారు. ఈ జర్నల్ మొదటి ఎడిషన్‌ను నియాజీ డా. ఇక్బాల్ కు అంకితమిచ్చారు. ఖచ్చితత్వానికి, నిజాయితీకి డాక్టర్ ఇక్బాల్ మారుపేరు. నిష్క్రియాత్మకతను ఖండించడం, అసమానత, వివక్ష, పీడన, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన తెలిపే ధర్మాగ్రహ నిరసన, ఆశావాద జీవితం పట్ల స్పష్టమైన వైఖరి, ప్రపంచంలో మానవుడి లక్ష్యం , ఒక్క మాటలో చెప్పాలంటే, మానవతావాదం, ప్రజాస్వామ్యం, శాంతి, సామరస్యం , ప్రజల మధ్య స్నేహం సౌహార్ధ్రతలు తదితర అనేక సుగుణాలకు ఆయన నిలువెత్తు చిరునామా. ఇంతటి గొప్ప మనిషి, మహాకవి, పండితుడు, డాక్టర్ అల్లామా ముహమ్మద్ ఇక్బాల్ 1938, ఏప్రిల్ 21 న తీవ్రమైన గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా తుదిశ్వాస విడిచారు. మంచికీ, మానవతకు, మైత్రీ బంధానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచిన అల్లామా ఇక్బాల్ ను తన జన్మదినం సందర్భంగానైనా గుర్తుచేసుకోవడం,'సారే జహాసె అచ్ఛా..హిందూసితాహమారా..'అని ఆమహనీయుని దేశభక్తి గీతాన్ని గుండెల నిండుగా పాడుకోవడం మనందరి కర్తవ్యం.

(నేడు మహాకవి అల్లామా డా. ఇక్బాల్ జయంతి)

(వ్యాస రచయిత జర్నలిజం విద్యార్థి)



నగర భవిష్యత్తే లక్ష్యంగా హైడ్రా పని చేస్తుంది

- హైడ్రాకు అండగా నిలిచిన నగర ప్రజలకు ధన్యవాదాలు
- నగర ప్రజలందిస్తున్న మద్దతు హైడ్రాకు స్ఫూర్తి
- మీరిచ్చిన స్ఫూర్తి మాకెంతో ఊతమన్న హైడ్రా కమిషనర్



ప్రతిపక్షం,సిటి బ్యూరో, నవంబర్ 8: హైడ్రాకు మద్ధతు పలికిన నగర ప్రజలకు హైడ్రా కృతజ్ఞతలు తెలిపింది. సామాజిక మాధ్యమాలు వేదికగా.. వేల ఇళ్లను హైడ్రా కూల్చిందంటూ కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని ర్యాలీలు, ప్రదర్శనల ద్వారా తిప్పి కొట్టిన వారికి హైడ్రా ధన్యవాదాలు తెలిపింది. ప్రజల నుంచి వచ్చిన మద్దతు హైడ్రాకు మరింత స్ఫూర్తినిచ్చింది అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని.. పర్యావరణ హితమైన నగరంలో ప్రజలు మెరుగైన జీవనాన్ని కొనసాగించాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు హైడ్రా పని చేస్తోందని స్పష్టం చేశారు. హైడ్రా వల్ల జరిగిన మేలును వివరిస్తూ..పెద్దలు, పిల్లలు, మహిళలు, యువకులు ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్ధతు తెలపడంపట్ల హైడ్రా హర్షం వ్యక్తం చేసింది. హైడ్రా వల్ల లక్షల మందికి లాభం చేకూరిందంటూ.. నగరవ్యాప్తంగా జరిగిన మేలును వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి తీరు మాలో స్ఫూర్తిని నింపిందన్నారు. మీడియా సంస్థలతో పాటు.. చాలా వరకు సామాజిక మాధ్యమాలు కూడా హైడ్రా కార్యక్రమాలను ప్రజలవద్దకు చేరవేసిన తీరును అభినందిస్తున్నామన్నారు.

చట్టాలను గౌరవిస్తూనే ముందుకు..

చట్టంలో ఉన్న అక్షరాల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం, ఆంతర్యం, లక్ష్యం తెలుసుకుని హైడ్రా పని చేస్తోందని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. రాజ్యాంగం,న్యాయ స్థానాలు, చట్టాలపైన హైడ్రాకు ఎనలేని గౌరవం ఉందని.. వాటి స్ఫూర్తితోనే ప్రకృతి పరిరక్షణకు పాటుపడుతున్నామన్నారు. పేదవారిని అడ్డం పెట్టుకొని బడాబాబులు సాగిస్తున్న కబ్జాలను వెలికి తీస్తుందన్నారు. ధనదాహంతో ఇష్టానుసారం కబ్జాలు చేసి ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నవారు హైడ్రాపై దాదాపు 700ల వరకూ కేసులు పెట్టారని.. వ్యక్తిగతంగా తనపై కూడా 31 వరకూ కంటెంప్ట్ కేసులు వేశారని గుర్తు చేశారు. చట్టాలను గౌరవిస్తూ.. ప్రజలు ఇచ్చిన స్ఫూర్తితో పర్యావరణాన్ని, ప్రజల ఆస్తులను పరిరక్షిస్తామన్నారు. ప్రభుత్వం దిశానిర్దేశం చేసిన విధంగా చెరువులు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించేందుకు పని చేస్తున్నామన్నారు. 2024 జూలైకి ముందు నుంచే నివాసం ఉన్న వారి ఇళ్ళ జోలికి హైడ్రా వెళ్ళదని స్పష్టం చేశారు. తప్పనిసరి అయి తొలగించాల్సివస్తే వారికి ప్రత్యామ్నాయం, పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిస్తామని హైడ్రా కమిషనర్ తెలిపారు.

రూ. 55వేల కోట్ల విలువైన ప్రజల ఆస్తులను కాపాడాం

హైడ్రా ఏర్పాటయిన నాటి నుంచి నేటి వరకు మొత్తం 181 డ్రైవ్స్ నిర్వహించి 954 కబ్జాలను తొలగించామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. మొత్తం 1,045.12 ఎకరాల భూమిని హైడ్రా కాపాడిందని.. వీటి విలువ సుమారు ₹ 50,000 కోట్ల నుండి ₹ 55,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇందులో ప్రభుత్వ భూములు 531.82 ఎకరాలు కాగా.. రహదారుల కబ్జాలు 222.30 ఎకరాల వరకూ ఉన్నాయి. చెరువుల కబ్జా 233.00 ఎకరాలు, పార్కుల కబ్జాలు 35 ఎకరాలు ఇలా.. మొత్తం 1045.12 ఎకరాలను హైడ్రా స్వాధీనం చేసుకుంది. వర్షాలు వచ్చినప్పుడు కాకుండా.. ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడంతో.. ఈ ఏడాది వరదలు చాలావరకు నియంత్రించామన్నారు. క్యాచ్‌పిట్స్ క్లీనింగ్ 56,330, నాళాల క్లీనింగ్ 6,721, నీటి నిల్వ పాయింట్లు క్లియర్ చేయడం 10,692, కల్వర్టు క్లియర్ చేయడం 1,928, ఇతర పనులు 21,301 ఇలా మొత్తం 96,972 పనులు హైడ్రా ఈ వర్షాకాలంలో చేపట్టిందన్నారు.

ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలపై దృష్టి..

ఈ ఏడాది వర్షాలు ఎడతెరిపి లేకుండా పడ్డాయి. భారీ వర్షాలు చాలా సార్లు నమోదయ్యాయి. భారీమొత్తంలో కాలువల్లో పూడికను తొలగించడంతో ఈ సారి నగరంలో వరదలను కట్టడి చేశామన్నారు. 5 సెంటీమీటర్ల వర్షం పడితే అమీర్‌పేట మైత్రీవనం పరిసరాలు వరద నీట మునిగేవి. ఇందుకు గల కారణాలను మూలాలకు వెళ్లి హైడ్రా కనుగొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రధాన రహదారి కింద భూగర్భంలో ఉన్న పైపులు పూర్తిగా పూడుకుపోవడంతో వరద ముంచెత్తే పరిస్థితులు తలెత్తుతున్నాయని హైడ్రా గ్రహించింది. వెంటనే ఆ పైపులైన్లలో పూడికను తొలగించడంతో వరద ముప్పు తప్పింది. తర్వాత 15 సెంటీమీటర్ల వర్షం పడినా ఎలాంటి ఇబ్బంది ఏర్పడలేదు. దీంతో పైన ఉన్న అంబేద్కర్ నగర్ బస్తీ, శ్రీనివాసనగర్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాలకు వరద ముప్పు తప్పింది. ఇదే పరిస్థితి ప్యాట్నీ నాలా వద్ద కూడా నెలకొంది. ఈ నాలా వాస్తవ విస్తీర్ణం 70 అడుగులు కాగా.. ప్యాట్నీ వద్దకు వచ్చే సరికి 15 అడుగులకు వెడల్పు తగ్గిపోయింది. ఈ ఆక్రమణలు తొలగించి రిటైనింగ్ వాల్ నిర్మించడంతో పాయిగా కాలనీ, ప్యాట్నీ కాలనీ, విమాన్‌నగర్, బీహెచ్ ఈ ఎల్ కాలనీచ ఇందిరమ్మ నగర్ ఇలా అనేక కాలనీలకు వరద ముప్పు తప్పింది. దశాబ్దాల సమస్య పరిష్కారం అయ్యింది. తూముకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ విలేజ్‌లోని తురకవాణికుంట నుంచి దేవరయాంజల్ చెరువుకు వెళ్లే వరద కాలువ 6 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. అక్కడ కొంతమంది ఆ నాలాను కేవలం 2 ఫీట్ల పైపులైను వేసి మిగతా భూమిని కబ్జా చేయడంతో తమ ప్రాంతాలన్నీ నీట మునుగుతున్నాయని ఫిర్యాదు అందగానే ఆ సమస్యను పరిష్కరించాం.

రూ. 58.40 కోట్లతో చెరువుల పునరుద్ధరణ..

నగరంలో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని హైడ్రా చేపట్టింది. మొదటివిడతగా చేపట్టిన 6 చెరువుల్లో ఇప్పటికే బతుకమ్మకుంట ప్రారంభమవ్వగా.. తమ్మిడికుంట (మాధాపూర్),కూకట్‌పల్లి నల్ల చెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్ ఉద్ దౌలా చెరువులు ఈ నెలాఖరుకు సిద్ధం చేస్తున్నామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు (మాధాపూర్), నల్లచెరువు (ఉప్పల్) చెరువుల పునరుద్ధరణతో వరద ముప్పును తగ్గించాం. అంతే కాదు.. పై చెరువుల ఆక్రమణలను తొలగించి 105 ఎకరాల నుండి 180 ఎకరాలకు పెంచాం. 75 ఎకరాల భూమి తిరిగి ప్రజలసొంతమయింది. బతుకమ్మకుంట పునరుద్ధరణతో అక్కడ లోతట్టు ప్రాంతాలను, కూకట్‌పల్లి నల్లచెరువుతో చుట్టూ ఉన్న బస్తీలు, తమ్మిడికుంటతో శిల్పారామం ప్రధాన రహదారిపై వరద లేకుండా చేశామని కమిషనర్ తెలిపారు. ప్రాధాన్య క్రమంలో మరిన్నిచెరువులు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో హైడ్రా పని చేస్తోందని చెప్పారు.



ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్‌కట్‌చేసిన ఓయూ కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్

ప్రతిపక్షం, షేక్‌పేట్, నవంబర్ 8:- సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు షేక్పేట ఓయూ కాలనీలో కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. 'లాంగ్ లీవ్ రేవంత్ అన్న' అనే నినాదాలతో ఇలాంటి పుట్టినరోజులు సీఎం రేవంత్ మరెన్నో జరుపుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు అన్నారు. ఓయూ కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్ కేక్ కట్ చేసి కార్యకర్తలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ కాలనీ పెద్దలు, కాలనీ వాసులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, ఓయూ కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్, రాఘవరెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, షేక్ మీరా వలీ, దర్గా రవి, క్రాంతి, షేక్ కబీర్, మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేను రేవంత్ రెడ్డి అభిమానిని

- సర్కారు సహకారం లేకున్నా సంస్థలు నడుపుతున్నాం
- ప్రైవేట్ విద్యా సంస్థల సంఘం చైర్మన్ రమేశ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : తనపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలకు వివరణ ఇస్తానని ప్రైవేటు విద్యా సంస్థల సంఘం చైర్మన్ రమేశ్ అన్నారు.తాను సీఎం రేవంత్‌కి ఫ్యాన్ అని, రేవంత్ రెడ్డిని హీరో లాగా చూస్తానని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేస్తే, రేవంత్ సీఎం అయ్యాక సహాయం చేశారని గుర్తు చేశారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు సహకరిస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన బకాయిల వల్లనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఏం చెప్పినా, ఒక ఒబిడియెంట్ విద్యార్థిలాగా వింటున్నానని తెలిపారు. 'విద్య వ్యాపారం కాదు సేవ' అని పేర్కొన్నారు. 97.23 శాతం ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నాయని పేర్కొన్నారు. డొనేషన్లు తీసుకోమని ప్రభుత్వమే అధికారం ఇస్తోందని, ప్రభుత్వంలోనే లోపం ఉందన్నారు. వాటిని సరిదిద్దుదామని తాము ప్రభుత్వానికి చెప్పామని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో ఫ్రాడ్ చేస్తున్నది తహసీల్దార్లని ఆరోపించారు. వారు తప్పుడు ఆదాయ సర్టిఫికెట్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఇటు ఐదేండ్లుగా ప్రభుత్వం డబ్బు ఇవ్వకపోయినా విద్యా సంస్థలను నడుపుతున్నామని తెలిపారు. తమ వెనక ఏ రాజకీయ శక్తులు లేవన్నారు. ప్రభుత్వం డబ్బులు ఇవ్వకుండా, ఓ ట్రస్ట్ బ్యాంక్ లాంటిది ఏర్పాటు చేయాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలన్నీ లక్ష కోట్ల టర్నోవర్ చేస్తున్నాయని రమేశ్ వెల్లడించారు.

సీనియర్ జర్నలిస్ట్ గిరి ప్రసాద్ మృతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8: గిరి ప్రసాద్ జర్నలిజం రంగంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చి, సామాజిక బాధ్యతతో పత్రికా రంగానికి సేవలు అందించారు. ఆయన ఆకస్మిక మరణం జర్నలిస్టు వర్గానికి తీరని లోటు. ఇటీవలే ఆయన తల్లి మృతి చెందగా, కేవలం పక్షం రోజుల వ్యవధిలో గిరి ప్రసాద్ మరణం జర్నలిస్టు వర్గాన్ని తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఎమ్మెల్సీ అంజి రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి గోదావరి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి పొందాలని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గోదావరి, అంజి రెడ్డి మాట్లాడుతూ గిరి ప్రసాద్ తన జీవితం మొత్తం జర్నలిజానికి త్యాగమూర్తి అని ఆయన ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలియజేశారు.

జాతీయ శిక్షణలో అట్ల శ్రీనివాస్ రెడ్డి



ప్రతిపక్షం, కరీంనగర్ బ్యూరో, నవంబర్ 8: 'రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్' మైసూరులో నిర్వహించిన కెరియర్స్ ఇన్ వోకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్ప్రినర్షిప్ ముగింపు శిక్షణ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చేతుల మీదుగా డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి సర్టిఫికెట్ అందుకున్నారు. మైసూరు లో ఈనెల 6 నుండి 8 వరకు జరిగిన జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణలో వృత్తి విద్య, వ్యాపారాభివృద్ధిలో మరింత స్పష్టతను మెలకువలను తెలుసుకున్నామన్నారు. విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత, ప్రొఫెషనల్ గైడెన్స్ మెరుగుదలకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 లక్ష్యాలను పాఠశాల స్థాయిలో అమలు చేయడానికి ఇలాంటి శిక్షణ ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ శిక్షణలో తెలంగాణ నుండి ఎస్సీఆర్టీ ఫ్యాకల్టీ సభ్యులు డా. సీహెచ్. భరణి కుమార్, రిసోర్స్ పర్సన్ లు డా. శ్రీధర్, డా. కందాల రామయ్య, చిదురాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైవిధ్యభరిత కళలకు కాణాచి కరీంనగరం

- కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రతిపక్షం, కరీంనగర్ బ్యూరో, నవంబర్ 8: వివిధ కళలకు పుట్టినిల్లు కావడంతో పాటు కళలకు కాణాచిగా వెలుగుతున్న ప్రాంతం కరీంనగర్ అని విశ్రాంత ప్రిన్సిపాల్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో గంగారపు మల్లేశం నాయకత్వంలో గురూస్, స్టూడెంట్స్, పేరెంట్స్ డ్యాన్స్ అకాడమీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి సాంస్కృతిక విద్యా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి డిజిటల్ యువతకు మన ప్రాంత సాంస్కృతిక వారసత్వ సంపద పట్ల ఆసక్తి పెంచడానికి, తమలో దాగిన సృజనాత్మక కళలను జాగృత పరచడానికి పోటీలు పునాదిగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కళ పట్ల ఆసక్తి దాగి ఉంటుందని, దానిని గమనించి వారికి తగిన శిక్షణ ఇవ్వడానికి యోగ్యమైన గురువును ఎన్నుకోవాలని సూచించారు. గంగారపు మల్లేశం మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలను కూడా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వాసి సౌజన్య రవిందర్ దంపతులు పాల్గొని యువతను ఉత్సాహపరిచారు. పోటీలలో గెలుపొందిన కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. గంగారపు సుమలత, శ్రీజ, చిలుక సుమన్, అటుకాపురమ రాజేష్, శ్రీ రామోజు రామకృష్ణ, చందుపట్ల జయలక్ష్మి, గజ్జెల ధర్మేందర్ పాల్గొన్నారు.



జూబ్లీ' ఉప ఎన్నికలో 'దేప' ప్రచారం

- ఇంటింటికి తిరిగి ఓటివ్వాలని వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : జూబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకోసం మహేశ్వరం నియోజకవర్గం పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలసి జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డి గూడలో ప్రచారం నిర్వహించారు. జూబ్లీ హిల్స్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే నవీన్ కుమార్ యాదవ్ కు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారంలో ఓటర్లను కోరారు. గతంలో మూడు పర్యాయాలు ఓ పార్టీకి, మరో రెండు పర్యాయాలు మరో పార్టికి అవకాశం ఇచ్చారని, ఈ ఉప ఎన్నికలో ఒక్క ఛాన్స్ కాంగ్రెస్ కు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు సమత, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, సరికొండ బ్రదర్స్, ఏఎంసీ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, శ్రీను నాయక్, దాంతోజు నర్సింహాచారి, పాండు గౌడ్, పాండు రంగా రెడ్డి, అప్పారావు, నవీన్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



యువకుడి అదృశ్యం

ప్రతిపక్షం, శంషాబాద్, నవంబర్ 8: మండలంలోని రశీద్ గూడ గ్రామానికి చెందిన తల్లపల్లి ప్రవీణ్ కుమార్ ఇంట్లో చెప్పకుండా వారం రోజులుగా కనిపించడం లేదు. దీంతో అతని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ప్రవీణ్ కుమార్ రశీద్ గూడలో ఎక్స్ ప్రెస్ కంపెనీలో డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన ఇంటి నుండి వెళ్లిన ప్రవీణ్ తిరిగా రాలేదు. గతంలో ఒకసారి ఇంటి నుండి వెళ్లి మూడు రోజులకు తిరిగి వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు మళ్లీ వస్తాడని ఎదురు చూశారు. కానీ రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'జూబ్లీహిల్స్'లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- ఎన్నికల తర్వాత ఏర్పాటు చేస్తామన్న మంత్రి పొంగులేటి
- పొంగులేటి సమక్షంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరిక



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 8 : జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రహమత్ నగర్ డివిజన్ కార్మికనగర్‌లో శనివారం సాయింత్రం జరిగిన కార్యక్రమంలో డివిజన్ బీజే యువమోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ సెక్రెటరీ ఇబ్రహీం వందలాది మంది తమ అనుచరులతో కాంగ్రెస్ లో చేరారు. మంత్రి పొంగులేటి వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొత్త రెసిడెన్షియల్ పాఠశాలను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. రూ.200 కోట్ల రూపాయిలు ఖర్చయ్యే ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉంటాయన్నారు.పేదలు, అన్నివర్గాల ప్రజలు అధికంగా ఉండే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత కనీసం 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను ఈ పాఠశాలలు అందిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు శంకర్‌నాయిక్, బల్మూరి వెంకట్, సీఎన్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, మహిళలకు రూ.2,500 సాయం అందించే పథకాలు త్వరలోనే అమలవుతాయి. ఇందుకు త్వరలోనే ముహూర్తం ఖరారు అవుతుంది. ఈ పథకాల అమలుకు సీఎం రేవంత్ ఆలోచన చేస్తున్నారు. నిధులు సమకూర్చుకునే పనిలో ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలి.

- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

ప్రాంతీయం



పేదలకు అండగా సీఎం సహాయనిధి

- ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి 8: పేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ గ్రామానికి చెందిన పడాల రాజశేఖర్ కు ఎమ్మెల్సీ అంజిరెడ్డి చొరవ తో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 24 వేల చెక్ ను శనివారం ఆయన స్వగృహం లో బాధిత కుటుంబ సభ్యులకు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు.



గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 8 : గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని శ్రీరామ్ నగర్ బీసీ సంఘం నాయకులు అన్నారు. శనివారం శ్రీరామ్ నగర్ పరిధి నుండి వెంకటాపూర్ ఎక్స్ రోడ్ వరకు శ్రీరామ్ నగర్ బీసీ సంఘం ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శ్రీరాంనగర్ రోడ్డు ప్రజలు మరియు వెంకటాపూర్ కావేలిగూడ ప్రజలకు ప్రయాణించడానికి ఇబ్బందిగా ఉన్న రోడ్డును సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి మనవంతు మనం సహాయం చేసుకున్నప్పుడే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీసీ సంఘం సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తమ్మిడికుంటకు కొత్త రూపునిచ్చిన హైడ్రా

- ర్యాలీగా వచ్చి చెరువును చూసి హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

ప్రతిపక్షం,సిటి బ్యూరో, నవంబర్ 8: ఐటీ కారిడార్ కి .. శిల్పారామానికి చేరువగా మాదాపూర్లో ఉన్న తమ్మిడికుంట చెరువు రూపు రేఖలు మార్చిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు స్థానికులు. ఒకపుడు అసాంఘిక కార్యకలాపాలకు దుర్గంధభరిత వాతావరణంలో దోమలు, క్రిమి కీటకాలతో ఉన్న ఈ పరిసరాల రూపురేఖలను హైడ్రా మార్చింది అంటూ అభినందించారు. ర్యాలీగా వచ్చి ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

రోడ్డులు, పార్కుల ఆక్రమణలను తొలగించిన హైడ్రా


అల్మాస్ గూడ బోయపల్లి ఎన్ క్లేవ్ కాలనీలో లేఔట్ ప్రకారం ఉన్న రోడ్లు, పార్కులను హైడ్రా కాపాడిందంటూ స్థానికులు ర్యాలీ నిర్వహించి కృతజ్ఞతలను తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ ఆయనపై తమకు ఉన్న అభిమానాన్ని కాలనీ వాసులు ఈ రూపంలో తెలియజేశారు..పూర్తి స్థాయి లో కాలనీ అభివృద్ధికి, సమస్యలు పరిష్కారం చేయాలని, కాలనీ పార్క్ ను అభివృద్ధి చేయాలని, రోడ్లు బాగు చేయాలని కోరారు. హుస్సేనీ ఆలయంలో ఫాతిమా కాలనీలో కూడా హైడ్రాకు మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో కనీసం 50%తక్షణం విడుదల చేయాలి

- నవంబర్ 15న జరగనున్న అఖిలపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల సమావేశం
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 8 : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో కనీసం 50% తక్షణం విడుదల చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.నవంబర్ 15న జరగనున్న అఖిలపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల సమావేశం పోస్టర్‌ను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో కనీసం 50% తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులో ఆలస్యం సరికాదని, కమిటీలు వద్దని, నిధులు నేరుగా కళాశాలలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ, విద్యార్థి నేతలు సంజయ్, హరికృష్ణ, సాహిత్, గణేష్, పాపారావు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ తన పాలనలో న్యాయవాదుల సంక్షేమాన్ని విస్మరించింది. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదుకుంటోంది. 2020 ఏప్రిల్ నుంచి మరణించిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రూ.46కోట్లు రిలీజ్ చేశాం. న్యాయవాది కుటుంబానికి సంక్షేమ నిధి ఇచ్చే మొత్తానికి అదనంగా రూ.4లక్షలు అందించనున్నాం.

- ఏపీ మంత్రి ఫరూక్

కలెక్టర్ ఇదేంటీ? 46 మైసమ్మ గుళ్లు కూల్చేస్తారా ?

- ఏం తమాషా చేస్తున్నారా?
- రోడ్డు పక్క మసీదులను వదిలేస్తారా?
- రోడ్డు పక్క మసీదులను మేం కూల్చేస్తాం ?
- రామగుండంలో రగులుతున్న ఉద్రిక్తత!
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికల వేళ రచ్చ
- త్వరగా పునర్నిర్మించకపోతే నేనే వస్తా
- బండి సంజయ్ ఫోన్ హెచ్చరిక



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 8: ఎంటీ.. కలెక్టర్ గారూ.. కమిషనర్ గారూ ఇదేంటీ..? అసలు ఏం చేస్తున్నారు. 46 మైసమ్మ ఆలయాల్ని కూల్చేస్తారా ..? రోడ్డు పక్క మసీదులను వదిలేస్తారా..? త్వరగా పునర్నిర్మించకపోతే నేనే వస్తా? జూబ్లీ ఉప ఎన్నికల తర్వాత నేనే స్వయంగా గోదావరిఖనికి వస్తా.. ఏం చేయాలో చేస్తా..? వెంటనే కూల్చివేసిన '46 మైసమ్మ ఆలయాల్ని వెంటనే పునర్మించండీ.. లేదంటే చర్యలు తప్పవు అని కేంద్ర హోంశాఖ మంత్రి 'బండి సంజయ్ పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్‌లకు ఫోన్ చేసి హెచ్చరిక జారీ చేశారు. దీంతో రామగుండంలో ఆలయాల వివాదంపై ఉద్రిక్తత!"నెలకొంది. తెలంగాణ రాజకీయ వాతావరణం మళ్లీ ఉద్రిక్తమవుతోంది. జూబ్లిహిల్స్ ఉపఎన్నికల వేడి ఇంకా చల్లారకముందే, రాష్ట్రంలో మరో రాజకీయ వివాదం చెలరేగింది. కేంద్ర నేత బండి సంజయ్ కుమార్ తాజాగా పెద్దపల్లి జిల్లా అధికారులతో ఫోన్ ద్వారా ఆగ్రహం వ్యక్తం తీరు రాష్ట్ర వ్యాప్తంగా వైరల్‌గా మారింది. ఉమ్మడి కరీంనగర్ లోని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో తాజాగా 46 దారి మైసమ్మ ఆలయాలను అధికారులు కూల్చివేయడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో ఆలయాలను కూల్చివేసిన అధికారులు మసీదులను ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న బండి సంజయ్ హైదరాబాద్ నుండి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీలకు ఫోన్ చేసి ఆలయాలను కూల్చివేయడంపై మండిపడ్డారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని విస్తరణలో భాగంగా కూల్చివేశామంటూ అధికారులు చెప్పడంతో "రోడ్డుకు అడ్డంగా మసీదులు కూడా ఉన్నాయి కదా? మరి వాటిని ఎందుకు కూల్చివేయలేదు"అని ప్రశ్నించారు. దీనిపై అధికారులు నీళ్లు నమలడంతో "ఏం తమాషా చేస్తున్నారా? ఎవరి మెప్పు కోసం మూకుమ్మడిగా మైసమ్మ ఆలయాలను కూల్చివేశారు? ఆటోడ్రైవర్ల అడ్డాల దగ్గర ప్రతిరోజు మైసమ్మ ఆలయం వద్ద మొక్కుకుంటారు. భక్తులు నిత్యం దర్శించుకుంటారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నాయనే నెపంతో ఇష్టమొచ్చినట్లు కూల్చివేస్తారా? భక్తుల మనోభావాలు పట్టవా? పోనీ అదే రోడ్డుకు అడ్డంగా అక్కడ మసీదులు కూడా ఉన్నాయి కదా? మరి వాటినెందుకు కూల్చివేయలేదు? హిందువులంటే అంత చులకనా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీకు 48 గంటలు టైమిస్తున్నా. కూల్చివేసిన దారి మైసమ్మ ఆలయాలన్నింటినీ ఆలోపు పునరుద్దరించాలి. లేకపోతే దారికి అడ్డంగా ఉన్న మసీదులన్నింటినీ కూల్చివేయాలి. లేనిపక్షంలో నేను గోదావరికి వస్తా. దగ్గరుండి మసీదులన్నింటినీ కూల్చివేయిస్తా. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ అయిన వెంటనే గోదావరిఖని వస్తా. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోసహా అధికారులందరినీ ప్రజల ముందు నిలబెడతా. జరగబోయే పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది."అని హెచ్చరించారు.



ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 8 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి ఆధ్వర్యంలో పీవీ మార్గ్ లోని ఎన్టీయార్ గార్డెన్ వద్ద జరిపిన సంబరాల్లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు, రాబోయే కాలంలో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్నిఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రేవంత్ రెడ్డికి మరింత శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు. ప్రముఖ సైకత శిల్పి వరప్రసాద్.. హుస్సేన్ సాగర్ తీరాన రేవంత్ రెడ్డి సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ ను మంత్రి జూపల్లి అభినందించారు.





కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 8 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని చిలుకూరు గ్రామంలోని చెరువు వద్ద మత్స్యకార సంఘానికి జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ద్వారా చేపలు పట్టడానికి అవసరమయ్యే పడవలను అందించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ...గత 20, 30 ఏళ్ల క్రితం మత్స్యకార సంఘాలు లాభాల బాటలో పయనించాయని, ప్రస్తుతం మన రాష్ట్రంలో చేప పిల్లల ఉత్పత్తి లేని కారణంగా ఇతర రాష్ట్రాల నుండి చేప పిల్లలను తెచ్చి ఇక్కడ పెంచడం ఆర్థికంగా భారం అవుతుందని, అందువల్ల మత్స్యకార సంఘాలు లాభాలు ఎక్కువగా అర్జించడం లేదని పేర్కొన్నారు. అనంతరం మత్స్యకార సంఘం తరఫున తమకు ఉచితంగా బోట్లను అందించిన కొండ విశ్వేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ శాసనసభ్యులు మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా నాయకులకు గున్నాల గోపాల్ రెడ్డి, యువ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి, మత్స్య సహకార సంఘం నాయకులు శ్రీరాములు ముదిరాజ్ , బిజెపి నాయకులు గరుగు రాజు ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

చర్చలు సఫలం.. రేపటి నుండి కళాశాలు రీ ఓపెన్

- రూ.1200 కోట్లు విడుదల'కు ఓకే
- తక్షణమే రూ. 600 కోట్లు
- త్వరలో మరో రూ.300 కోట్ల చెల్లింపునకు హామీ
- దసరా ముందే రూ. 300 కోట్లు విడుదల

వడ్లకొండ సదానందం



ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్, నవంబర్ 8: తెలంగాణ ప్రభుత్వం, ప్రయివేట్ కళాశాల యాజమాన్యాల మధ్య తాజాగా జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. మొత్తం బకాయి రియాంబర్స్మెంట్స్, స్కాలర్ షిఫ్ కలిపి రూ 1200 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉండగా అందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ తెలిపింది. ఇందులో దసరా ముందు రూ. 300 కోట్లు చెల్లింపులు చేసింది. ఇంకా రూ. 900 కోట్లు పెండింగ్ బిల్లులు బకాయి లు ఉన్నాయి. అయితే ప్రభుత్వం తో జరిగిన చర్చల్లో తక్షణమే రూ. 600 కోట్లు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం. చేసింది. మిగిలిన మరో రూ. 300 కోట్లు త్వరలో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో చర్చలు సఫలం అయ్యాయి. దీంతో రేపు సోమవారం నుండి తిరిగి ప్రయివేట్ కళాశాలలు తెరుసుకొనున్నాయి. పెండింగ్ రియాంబర్స్మెంట్స్, స్కాలర్ షిఫ్ కోసం ప్రవేట్ కళాశాలలు బంద్ పాటిస్తున్నాయి. విద్యార్థి సంఘాలు ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేశాయి. విద్యార్థులు ఆందోళన చెందుతున్న తరణంలో ప్రభుత్వం అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్ర సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చర్చలు సఫలం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. మరో రూ.300 కోట్లను త్వరలో చెల్లించేందుకు హామీ ఇచ్చారు. గతంలోనూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు ఫీజు బకాయిలు చెల్లించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలు ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కళాశాలల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా సోమవారం నుండి తెరుచుకోనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టుగా ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ప్రైవేటు కళాశాలలు ఫీజు బకాయిలు చెల్లింపునకు సర్కారు అంగీకారం తెలిపింది. తక్షణమే రూ.600 కోట్లు విడుదలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. మరో రూ.300 కోట్లను త్వరలో చెల్లించేందుకు హామీ ఇచ్చారు. గతంలోనూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు ఫీజు బకాయిలు చెల్లించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలు ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కళాశాలల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా సోమవారం నుండి తెరుచుకోనున్నాయి. ఈ మేరకు డిప్యూటీ సీఎంతో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్లుగా ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ప్రైవేటు కళాశాలల బంద్‌పై సీఎం స్పందన :ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలను చెల్లిస్తామన్నారు. తమ ప్రభుత్వ హయాంలోని బకాయిలను ముందు గా చెల్లిస్తామని ఆయన వివరించారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దని హితవు పలికారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయన్నారు.కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదని ఆయన వివరించారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు.

ప్రస్తుతానికి సంతోషం



ప్రభుత్వం 600 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడం ప్రస్తుతానికి సంతోషంగానే ఉన్నా కూడా మిగిలిన బకాయిలు పూర్తిగా చెల్లిస్తే, డిగ్రీ పీజీ కళాశాలలు బ్రతుకుతాయి. డిగ్రీ పీజీ కళాశాలలు పూర్తిగా ఫీజు రీయింబర్స్మెంట్ మీదనే ఆధారపడి ఉన్నాయి. ఇప్పటికే 4 సంవత్సరాల నుండి ఫీజు రీయింబర్స్మెంట్ రాని కారణంగా కళాశాలల యాజమాన్యాలు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయి ఉన్నారు. కనుక ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించి కళాశాలలను ఆదుకోవాలి.

– గోవిందవరం కృష్ణ, శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ యాజమాన్య సంఘం, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు

సమసమాజ స్థాపనే ఎర్రజెండా లక్ష్యం

- సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి
- నియోజకవర్గ కమిటీని పార్టీ జిల్లా సమితి గుర్తించదు
- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 8: సమ సమాజ స్థాపనే ధ్యేయంగా నిరంతరం సీపీఐ పార్టీ పోరాడుతుందని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శనివారం హుస్నాబాద్ లోని స్థానిక అణభేరి, సింగిరెడ్డి అమరుల భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన సీపీఐ అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల కార్యవర్గ, కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిందని, వందేళ్ల సుదీర్ఘ ఉద్యమ స్ఫూర్తితో పీడిత వర్గాల ప్రజలకు, అణగారిన వర్గాల హక్కుల కోసం, అంతరాల్లేని సమాజం కోసం, భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమిస్తుందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నిరంకుశ పాలన సాగిస్తోందని, మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధం అని చెపుతున్నా కూడా బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ఆ ఎన్కౌంటర్లను ఆపి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు చేరువవుతుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తమ పార్టీ మద్దతిచ్చిందని, 30 వేల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలవనున్నారని ఆయన అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తుతో మూడు మండలాల వ్యాప్తంగా పార్టీ అభ్యర్థులను బరిలో ఉంచుతామని ఆయన తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రపంచంలోని 40 దేశాల్లో ఉన్న కమ్యూనిస్టు ప్రతినిధులు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని అన్నారు. శత జయంతి ఉత్సవాలకు సిద్దిపేట జిల్లా నుండి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల హుస్నాబాద్ లో నూతనంగా సీపీఐ నియోజకవర్గ కమిటీని జిల్లా పార్టీకి సమాచారం లేకుండా వేయడం జరిగిందని, నియోజకవర్గ కమిటీని జిల్లా పార్టీ గుర్తించదని పార్టీ శ్రేణులు తెలుసుకోవాలని ఆయన అన్నారు. పార్టీ నిబంధనలకు పాటించని నాయకుల పైన పార్టీగా కచ్చితంగా క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు..ఈ సమావేశంలో సీపీఐ అక్కన్నపేట, కోహెడ మండలాల కార్యదర్శులు కొమ్ముల భాస్కర్, వేల్పుల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేశ్, జేరిపోతుల జనార్దన్, పిల్లి రజిని, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొజ్జపురి రాజు, ముంజ గోపి, నాయకులు కొయ్యడ కొమురయ్య, మిట్టపల్లి మొండయ్య, మాడిశెట్టి శ్రీధర్, రోళ్ల భాగ్య,సుధాకర్, వేల్పుల ప్రసన్న కుమార్, గట్టు బాబు, పిట్టల శ్రీను, బండారు లక్ష్మణ్, జాగిరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15న స్పెషల్ లోక్ అదాలత్

- సీపీ విజయ్ కుమార్



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 8: నవంబర్ 15 తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ జరుగుతుందని పోలీస్ కమిషనర్ ఎస్ఎం విజయ్ కుమార్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 2230 కంపౌండబుల్ కేసులు రాజీ ద్వారా పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. నవంబర్ 15 వరకు ప్రతి రోజు లోక్ అదాలత్ కొనసాగనుందని పేర్కొన్నారు. చిన్న చిన్న కంపౌండబుల్ కేసుల్లో కోర్టు చుట్టూ తిరుగుతున్న ప్రజలకు ఇది ఒక అద్భుత అవకాశం అని తెలిపారు. రాజీ పడదగిన కేసులు సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ వివాదాలు, రోడ్డు ప్రమాదాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఇతర రాజీ పడదగిన కేసులు లో నిందితులు, ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని నేరుగా సంప్రదించి రాజీ పడవచ్చని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని, జ్యుడీషియల్ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీపీ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రతి పోలీస్ స్టేషన్లో అధికారులు రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ రాజీ పడేలా అవగాహన కల్పిస్తున్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



బీఆర్ఎస్ గెలుపు కాంగ్రెస్ కు కనువిప్పు కావాలి

- ఎర్రగడ్డలో గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 8: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కావాలంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ను మెజార్టీతో గెలిపించాలని గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మెదక్ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇంఛార్జ్ ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, శివాజి నగర్ భూత్ ఇంఛార్జ్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డలో శనివారం నాడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టిన కాంగ్రెస్ పార్టీకి, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని పేదల కోసం కొట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. గ్యారంటీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీయాలంటే కారుకు ఓటేసి మాగంటి సునీత గెలిపిస్తేనే ఆరు గ్యారెంటీలు నడుచుకుంటూ వస్తాయన్నారు. అనంతరం వారు వార్డు ప్రజలతో కలిసి ఎర్రగడ్డలో జరిగే కేటీఆర్ ప్రచార సభలో పాల్గొనేందుకు ర్యాలీగా వెళ్లారు.



ఇసుక కొరత.. ఆగిన ఇందిరమ్మ ఇళ్లు

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 8: ఇసుక కొరతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడుతోంది. ఇసుక సరఫరా లేకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. దీనికి తోడు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు భారీ వర్షాల వల్ల తీవ్రంగా దెబ్బ తిన్నాయి. దీనికి తోడు అవసరమైన ఇసుక లభ్యం కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. వర్షాలు లేక ముందు నిల్వ చేసుకున్న ఇసుక ధరను వ్యాపారులు రెట్టింపు చేసి అమ్ముతున్నారు. రెట్టింపు ధరకు అయినా ఇసుక దొరకడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కు పాదం మోపడంతో ఇసుక రవాణా పూర్తిగా నిలిచింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. నిధులు మంజూరు అయినా ఇసుక లేక ఇళ్లు ఆగిపోయాయని లబ్ధిదారులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నాచగిరి భక్తజన సిరి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 8: కార్తీక మాసం, రెండవ శనివారం పురస్కరించుకొని వర్గల్ మండలం నాచగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయినది. నేటి రోజు విశేషంగా స్వామివారి కల్యాణములు, అభిషేకములు, సత్యనారాయణ స్వామి వ్రతములు మొదలగు పూజలు వైభవంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఉత్తర్వుల అనుసరించి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా "విరించి" నృత్య అకాడమీ, వారు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ మరియు కార్యనిర్వాణాధికారి విజయ రామారావు, ఆలయ సూపర్వైజర్ సుధాకర్ తగు ఏర్పాట్లు చేశారు.



ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 8: కొమురవెల్లి మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం కొమురవెల్లిలో జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి అనంతరం రాజగోపురం వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరుగు కృష్ణ, లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, కాయిత శ్రీనాథ్ రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, బత్తిని నర్సింహులు, సానాది భాస్కర్, ఏర్పుల కృష్ణ, జంగని రవి, శెట్టిపల్లి విజేందర్, పంజాల మల్లేశం, స్వాములపల్లి రమేష్, బుడిగి అశోక్, ఏర్పుల రాజు, వంగ ప్రసాద్ రెడ్డి, ఉప్పల వంశీ, యేనిశెట్టి కిరణ్, కొయ్యడ ప్రశాంత్, సాయికృష్ణ, మల్లం బాలయ్య, జనగామ శ్రీకాంత్, దొడ్ల విష్ణుమూర్తి, పబ్బోజు రాములు చారి, ఎక్కలదేవి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, చింతల పర్శారాములు, దండు రమేష్, ఈగ కనకయ్య, బుడిగే ఐలేని, పొన్నం శేఖర్ మరియు చింతల రమేష్ పాల్గొన్నారు.



మెదక్ సీఎస్ఐ పాస్టేనేట్ ఎన్నికలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 8: మెదక్ చర్చ్ ప్రాంగణంలోని సండే స్కూల్ హాల్లో శనివారం సీఎస్ఐ పాస్టేనేట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు మినిస్ట్రియల్ కమిషనరీ విల్సడన్, డీసీసీ వైస్ చైర్మన్ జేసు దాస్, ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా చర్చి ప్రాంగణం అంత సందడిగా మారిపోయింది.ఈ సందర్భంగా ప్రెస్ బీటర్ ఇంచార్జి శాంతయ్య మాట్లాడుతూ.. పాస్టేనేట్ ఎన్నికల్లో భాగంగా 20 మంది సభ్యుల ఎన్నికకు, 3 సంవత్సరాల కాలపరిమితితో సంఘానికి చెందిన సుమారు 1712 ఓట్లు ఉండగా మూడు ప్యానెల్స్‌లో 60 మంది పోటీలో నిలవడం జరిగిందని అన్నారు. సంఘ సభ్యులు 20 మంది సభ్యులను ఎన్నుకునేందుకు సిద్ధపడ్డారని తెలిపారు. ఈఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్ గా పద్మారావు, జ్ఞాన ప్రసాద్, 50 మంది ఎన్నికల సిబ్బందితో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు కొనసాగాయని పేర్కొన్నారు. సభ్యుల ఎన్నిక అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 8: కారు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామ శివారులో రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పోసానిపల్లి గ్రామానికి చెందిన అబ్రమైన రాములు దౌల్తాబాద్ కు వస్తున్న క్రమంలో కోనాయిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న కారు రెండు కాళ్లపై వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ కు సమాచారం ఇవ్వగా ప్రథమ చికిత్స అందించి గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



క్రీడల్లో గెలుపోటములు సహజం

- డీఎస్పీ ప్రసన్నకుమార్
- ముగిసిన 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు


ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 8: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. మూడు రోజులుగా మెదక్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు కళాశాలలో జరిగిన రాజన్న సిరిసిల్ల జోనల్ స్థాయి గేమ్స్ ముగింపు కార్యక్రమానికి శనివారం మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినీలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి అనేది విజయానికి నాంది అన్నారు. ప్రతీ ఒక్కరూ స్నేహ భావాలను అలవర్చుకుంటూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. ప్రతీ ఏటా ఇక్కడ క్రీడలను నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రిన్సిపాల్ లు పద్మావతి, సత్యవతి, అనురాధ,సంధ్యారాణి,వర్గల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వివిధ స్కూల్ ల పిఈటిలు,పిడిలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో ప్రజల వద్దకే వైద్యం

- ఆయుష్ విభాగం వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్



ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 8: వైద్యాన్ని ప్రజల వద్దకు తెచ్చేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఆయుష్ విభాగం వైద్యాధికారి డాక్టర్ కె.అనిల్ కుమార్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని దుద్దెడలో శనివారం హైదరాబాద్ లోని రామంతపూర్ కు చెందిన ధర్మ కిరణ్ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి, సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 'ఉచిత హోమియోపతి వైద్య శిబిరం' నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షల ఆధారంగా నిపుణులైన వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో వైద్య బృందం దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు, చక్కెర వ్యాధి, థైరాయిడ్, శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, పులిపిర్లు, అజీర్తి, పైల్స్ వంటి వ్యాధులకు చికిత్స అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 129 మంది పురుషులు, 153 మంది స్త్రీలతో పాటు 32 మంది పిల్లలకు కలిపి మొత్తం 314 మంది రోగులు చికిత్స పొందారు. ఈ శిబిరంలో 182 రోగులకు హిమోగ్లోబిన్, రక్త గ్రూపులు, చక్కెర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఉచిత వైద్య శిబిరం నిర్వహణాధికారి డాక్టర్ కె.అనిల్ కుమార్ తెలియజేశారు. ధర్మకిరణ్ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి హైదరాబాద్ సూపరింటెండెంట్ డాక్టర్ జి సోమ్యా, సీనియర్ డాక్టర్ జి లలిత, సిద్దిపేట ఆయుష్ విభాగం వైద్యాధికారులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పి.కవిత, డాక్టర్ బి.శ్రీప్రియ, డీకే ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యులు, జేఎస్పీఎస్ హోమియో వైద్యశాల పీజీ డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు చికిత్సను అందజేశారు. రోగులకు ఫార్మసిస్టులు ఎం.యాదమ్మ, పి.సంతోషి రాణి మందులను అందించారు. నర్సింగ్ సిబ్బంది యాదగిరి, వెంకటేశ్, స్వామి, యోగా శిక్షకుడు శ్రీనివాస్, పీటీఎస్ నరేశ్, ఏఎన్ఎం హమీదా, ఆశా వర్కర్లు వైద్య సేవలను అందించారు. ఈ వైద్య శిబిరంలో పంచాయతీ సెక్రటరీ చక్రపాణి, కాంగ్రెస్ నాయకుడు చిరంజీవి, మాజీ ఎంపీటీసీ జి.బాలాజీ, రామస్వామి, కాంగ్రెస్ ముఖ్య నాయకులు,గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన మీడియాకు, గ్రామస్తులకు వైద్య శిబిర నిర్వహణ అధికారి డాక్టర్ కె.అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.



కుప్పంను ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తాం. ప్రైవేట్, రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రోత్సహిస్తాం. ఇప్పటికే యూనివర్సిటీ, మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలున్నాయి. కుప్పంలో ల్యాప్‌టాప్, మొబైల్ యాక్సెసరీస్ వంటి ఏడు సంస్థలకు ప్రభుత్వం 241 ఎకరాలు కేటాయించాం. రూ.2,203కోట్ల పెట్టుబడితో సంస్థలు ఏర్పాటు కానున్నాయి.
- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం



రాజకీయ వేడి తలపిస్తున్న వైశ్య సంఘం ఎన్నికలు

- నేడు ఎన్నికల పోలింగ్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 8: సిద్దిపేట వైశ్య సంఘం ఎన్నికలు సాధారణంగా శాంతియుతంగా జరుగుతాయి. ఈ సారి మాత్రం వైశ్య సమాజంలో పోటీ ఆసక్తికరంగా మారింది. పట్టణం మొత్తం ఈ ఎన్నికల చర్చ జరుగుతోంది. సిద్దిపేట పట్టణ వైశ్య సంఘంలో 8,366 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. నేడు సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ఎన్నికలు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఉత్సాహభరితంగా, ప్రతిష్టాత్మకంగా సాగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధానంగా రెండు ప్యానల్లు పోటీ పడుతున్నాయి. నెతి కైలాసం ప్యానల్, అయిత బాల్ రాజేశం ప్యానల్ రంగంలో ఉన్నాయి. ఇరువైపులా బలమైన అభ్యర్థులు రంగంలోకి దిగడంతో పోటీ మరింత హోరాహోరీగా మారింది. పట్టణమంతా ప్రచార వాహనాలతో హోరెత్తిస్తున్నారు. ప్రచారంలో అభ్యర్థులు సభ్యులను వ్యక్తిగతంగా కలుస్తూ, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామనే హామీలు ఇస్తున్నారు. కొంతమంది యువ నాయకులు ఆధునిక పద్ధతిలో సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని విస్తరిస్తుండగా, పెద్ద నాయకులు సంప్రదాయ బాటలో ప్రజల మధ్యకు వెళ్లి మద్దతు కోరుతున్నారు. సిద్దిపేట వైశ్య సంఘం గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో విశేష గుర్తింపు పొందింది. ఎవరు గెలిచినా సమాజ హితానికే కట్టుబడి, సమగ్ర వైశ్య సంఘ అభివృద్ధి కోసం కృషి చేస్తారని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థి గెలిచిన తర్వాత సంఘ అభివృద్ధి కోసం కృషి చేయాలని మాజీ వైస్ ఎంపీపీ, రిటైర్డ్ ఎస్ఐ పోలీసు రాజులు ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలకు ఈ ఎన్నిక మార్గదర్శకంగా ఉంటుందన్నారు.

ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 8: సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అధ్వర్యంలో అంబేద్కర్ చౌరసస్తాలో వేడుకలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మీసం మహేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుంటూ పది కాలాల పాటు చల్లగా ఉండాలని, తెలంగాణ ప్రజలకు సుభిక్షమైన పాలన అందించాలని ఆకాంక్షించారు. అంతే కాకుండా రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వంలో అమలయ్యే ఆరు గ్యారంటీలే వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టాం కడతారని, మరో పది ఏండ్లపాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము ప్రశాంత్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, కిసాన్ సేల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల భూపతిరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కుడు అనిల్, ఫిషర్మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు అంతగిరి చంద్రశేఖర్ చిన్నకోడూరు మండల్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండి సలీం,ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షులు నముండ్ల వినోద్,చౌడారం గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టిపర్తి చందు ,కస్తూరిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు నక్కరాజు సీనియర్ నాయకులు పుచ్చకాయల వెంకట్ రెడ్డి,రామంచ గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్మ ఎల్లయ్య,నర్సిలు చంద్లపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కనకయ్య,అనుపాటి విజయ రెడ్డి, దూది ఎల్లారెడ్డి,దేవరాయ శేఖర్,చిన్నకోడూరు గ్రామ శాఖ అధ్యక్షులు గుడిమళ్ల మల్లేశం పాకాల లక్ష్మారెడ్డి, మేడిపల్లి అనిల్, మంద శ్రీకాంత్, భైరోజు రమేష్, తాళ్లపల్లి రాజు వెంకన్న. భాస్కర్ రాముని పట్ల గ్రామ శాఖ అధ్యక్షులు కర్రె మధు,ఓబులాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.



మక్కలు కొనలేక మా మీద నిందలా?

- బీఆర్ఎస్‌నాయకుల మండిపాటు

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 8: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి, మక్కలను కొనుగోలు చేయలేక కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై, ప్రజా ప్రతినిధులపై నిందలు ఎలా మోపుతారని దౌల్తాబాద్ మండల పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు సయ్యద్ రహిమొద్దీన్, బండారు దేవేందర్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మద్దెల స్వామి, బండారు లాలు మక్కలు కొనుగోలు చేయడంలో బీఆర్ఎస్ కి చెందిన పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలు అసమర్థులని విమర్శించారని అన్నారు. తాము మక్కలు కొనుగోలు చేయడం లేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సిగ్గుచేటని మండిపడ్డారు. అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మర్చిపోయి కాంగ్రెస్ నాయకులు, తమపై మాట్లాడడం తగదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు దౌల్తాబాద్ లో గోదాములను, మార్కెట్ స్థలాన్ని చైర్మన్, ఎమ్మెల్యేలకు అప్పజెప్పితే మక్కల కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు స్టీవెన్ రెడ్డి, స్వామి, నరేష్, తదితరులు ఉన్నారు.

బోధన్ నుండి బెంగళూరుకు బస్సు ప్రారంభం

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 8: బోధన్ నుండి బాన్సువాడ మీదుగా బెంగళూరుకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్ ప్రారంభమైంది. ప్రయాణికుల సౌకర్యార్థం బాన్సువాడ డిపో మేనేజర్ రవి కుమార్ బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. బోధన్ నుంచి బస్సు ప్రతిరోజు మధ్యాహ్నం 12.30 గం లకు బయలుదేరి బాన్సువాడకు 1.10 గంటలకు చేరుకుని, 1.30 గంటలకు బెంగళూరు కు బయలుదేరుతుంది. ఈ బస్సు మెదక్, జేబీఎస్, ఎంజీబీఎస్, శంషాబాద్, జడ్చర్ల, కర్నూలు, అనంతపూర్, బాగేపల్లి మీదుగా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.05 గంటలకు బాన్సువాడకు చేరుకుని, బోధన్ కు 9 గం లకు చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.



పొలాల్లో నీరు.. రైతు కంట కన్నీరు

- వరి కోతలకు తప్పని తిప్పలు

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 8: కోతకు వచ్చిన వరి పొలాలు నీటితో జాలు పడుతున్నాయి. ఇటీవల మొంథా తుపాన్ తో నిర్విరామంగా కురిసిన భారీ వర్షాల వల్ల పొలాల్లో నీరు నిలిచింది. చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లడంతో పొలాలు జాలు పట్టాయి. పొలాల్లో చేరిన నీరు తగ్గడం లేదు. నీటితో పొలాలు జాలు పట్టడంతో వాటిని ఆరబెట్టేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. దీంతో వరి కోత యంత్రాలతో వరి కోసేందుకు ప్రయత్నిస్తే యంత్రాలు దిగబడుతున్నాయి. ఫలితంగా వరి కోత యంత్రాలు నిరుపయోగంగా మారాయి. దిగబడుతున్న వారి పొలాల్లో వరి కోసేందుకు చైనుతో కూడిన వరి కోత యంత్రానికి గంటకు రూ.3 వేలు చార్జి వేస్తున్నారు. చైను వరి కోత యంత్రాలు సరిపోయే సంఖ్యలో లేవు. దీంతో వరి కోయడం ఇబ్బందిగా మారింది. ఇక చెరువు వరద జలాలు పారే పొలాలలో చైనుతో కూడిన యంత్రంతో వరి కోయాల్సి ఉంటుందని రైతులు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని చైనుతో కూడిన యంత్రాలను సమకూర్చాలని వారు కోరుతున్నారు.



ఆర్యవైశ్య సంఘ ఎన్నికల్లో గెలిపించండి

- సిద్దిపేట ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష అభ్యర్థి నేతి కైలాసం

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 8: సిద్దిపేట ఆర్యవైశ్య సంఘ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా తాము పని చేస్తామని అధ్యక్ష అభ్యర్థి నేతి కైలాసం అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ సభ్యుల అభివృద్ధి కోసం అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులందరికీ అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామన్నారు. నేడు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు జరిగే ఎన్నికల్లో సంఘ సభ్యులు అందరూ తమ ప్యానల్ కు ఓటు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం సభ్యులు, అభ్యర్థులు తొడుపునూరి వెంకటేశం, గందె నాగరాజు పలువురు పాల్గొన్నారు.



టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కొండల్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 8: తెలంగాణ గణిత ఫోరం మెదక్ జిల్లా నూతన శాఖ ఏర్పడింది. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడిగా జడ్పీహెచ్ఎస్ కూచనపల్లి పాఠశాలకు చెందిన బి. కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా శివ్వ నాగరాజు, ఉపాధ్యక్షులుగా బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా గౌరవ అధ్యక్షులు సదన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు కొండల్ రెడ్డి మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలు పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టడానికి కృషి చేస్తామని, గణిత బోధనలో ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు వర ప్రసాద్, పంతంగి శ్రీనివాస్, ధనుంజయ్, గణిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పాటను అసభ్యంగా రీల్స్ చేయడమా?

- రీల్స్ చేసిన వారు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య డిమాండ్



ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 8: 'పైలం తల్లి మాయమ్మ' అనే తెలంగాణ వలస జనుల కన్నీటి పాటను కొంతమంది ఆకతాయి యువకులు వ్యంగ్యంగా, చాలా అసభ్యంగా చిత్రీకరించి రీల్స్ చేయడం సోషల్ మీడియా వికృత చేష్టలకు పరాకాష్ట అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) గౌరవాధ్యక్షురాలు విమలక్క, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి మల్సూర్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్ పోతుల అన్నారు. రీల్స్ ను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంబాయి, దుబాయి, బొగ్గు బాయిగా మారిన తెలంగాణ వలస బతుకులను కళ్లకు గట్టిన అమ్మ పయిలం తల్లి మాయమ్మ పాట రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ఎంతో ప్రభావితం చేసిందన్నారు. ఈ పాటను పాడిన సంతోష్ ఆ పాట పేరుతో పయిలం సంతోష్‌గా ప్రసిద్ధి చెందారని చెప్పారు. ఈ పాటను కోదారి శ్రీను రాయగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విస్తృతంగా ప్రచారం చేసిందని తెలిపారు. తెలంగాణ ధూంధాం వేదికల పైన ఈ పాటను వందల ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. అలాంటి ప్రజల పాట, తెలంగాణ వలస జనుల కన్నీటి పాటను కొంతమంది ఆకతాయి యువకులు ఒక రీల్ చేస్తూ చాలా వ్యంగ్యంగా, చాలా అసభ్యంగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చిత్రీకరించదాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ రీల్ చేసిన వారు వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది సోషల్ మీడియా యొక్క వికృత చేష్టలకు పరాకాష్ట అని పేర్కొన్నారు. చాలామంది అమరవీరుల పాటలను ఆపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల పాటలను, అమర వీరుల పాటలను,ప్రజల పోరాట చరిత్రను వక్రీకరించ వద్దని తీవ్రంగా హెచ్చరించారు. నెటిజన్లు, ప్రజలు, అభిమానులు, సాహిత్యాభిమానులు, ప్రజల పాటను అభిమానించే వాళ్ళందరూ ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. ఇలాంటి వారి చర్యల పట్ల తమ నిరసనను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 8: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నంగునూరు, సిద్ధన్నపేట, అక్కెనపల్లి, గట్లమల్యాల, కొండంరాజుపల్లి, ఘనపురం, ఖాతా గ్రామాలలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్ కో సిద్దిపేట సహాయ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతులతో పాటు విద్యుత్ తీగల మరమ్మత్తు పనులు చేపడుతున్నందున ఎల్ సీ తీసుకుంటామని అన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నంగునూరు 33 కేవీ ఫీడర్ పైన ఎల్ సీ ఇస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అందరూ సహకరించాలని కోరారు.



సీపీఐ జాతాను విజయవంతం చేయండి

- పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ పిలుపు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 8: సీపీఐ జాతాను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టాపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సిద్దిపేట పట్టణంలోని పార్టీ కార్యకర్తలను, కార్మికులతో కలిసి కరపత్రాలను కిష్టాపురం లక్ష్మణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటోందని అన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సీపీఐ అని తెలిపారు. ఈ నెల 17న సీపీఐ పార్టీ జాతా సిద్దిపేట జిల్లాకు చేరుకోనుందని తెలిపారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, అనుబంధ ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు వేల సంఖ్యలో పాల్గొని జాతాకు స్వాగతం పలకాలని, అనంతరం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మంది పాల్గొనే ముగింపు బహిరంగ సభతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగి రాజు, నర్సింలు, రాములు, యాదగిరి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

- నంగునూరులో సీఎం జన్మదిన వేడుకలు



ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 8: రాష్ట్ర అభివృద్ధియే ధ్యేయంగా, పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో శనివారం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు తప్పెట శంకర్ తదితరుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కేకు కోసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కృషికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, బాగు శ్రీకాంత్, గౌరబోయిన సంపత్, రాగుల కృష్ణ, రాగుల కనకయ్య, సందెబోయిన తిరుపతి, సి.హెచ్.బాలయ్య, బస్వరాజు రాములు, తుపాకుల శ్రీనివాస్, దేవులపల్లి శ్రీకాంత్, అనుముల జయపాల్ రెడ్డి, పంగ రాజ శేఖర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఆరెపల్లి సురేశ్, ముక్కెర లింగం, గౌరబోయిన రాజు, బడే సాంబయ్య, మ్యాక రజినీకాంత్, ఆదిమూలం మైసయ్య, జెల్ల పోచయ్య, ఆడెపు ఆనందం, దేవులపల్లి శంకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



బిహార్ స్టూడెంట్స్‌కు తమ ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు, ఫుట్‌బాల్, హాకీ స్టిక్స్ ఇచ్చింది. ఆర్జేడీ తుపాకులు ఇవ్వడం గురించి మాట్లాడుతోంది. బిహార్ ప్రజలు తుపాకుల ప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. జంగిల్‌రాజ్ పాలనలో రాష్ట్రంలో ఓ పెద్ద హాస్పిటల్ కానీ, మెడికల్ కాలేజీ కానీ ఏర్పాటు చేయలేదు. వారికి పరిశ్రమలు మూసివేయడమే తెలుసు.

- బిహార్ ప్రచారంలో ప్రధాని మోడీ

ప్రాంతీయం

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి లింగన్న
- నీటమునిగిన పంటలను పరిశీలన



ప్రతిపక్షం, తొర్రూరు, నవంబర్ 8: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి లింగన్న డిమాండ్‌చేశారు. మరిపెడ మండలం అబ్బాయిపాలెం బోడతండ గ్రామంలో ఇటీవల "మెంథా" తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయిన పంటలను సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ " అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. తేమ పేరుతో కటింగ్లు విధించి రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదు" అని డిమాండ్ చేశారు. అదే సమయంలో, ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో ఉన్న శ్రద్ధ రైతుల పట్ల లేకుండా పోయిందని, వ్యవసాయ అధికారులు తమ ఆఫీసులకే పరిమితమైపోతున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. రైతుల సమస్యలకు పరిహారం కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం రైతుల పంటలను కాపాడాలని, తడిసిన ధాన్యాన్ని పత్తి ,మొక్కజొన్న పంటలను ఏవో, ఏఈఓ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పంట నష్టాన్ని అంచనా వేసి పేద రైతులను కాపాడాలని లింగన్న స్పష్టం చేశారు. ఆయన వెంట గుగులోత్ చంద్రు, గుగులోత్ గోంది, బానోత్ బోడి చంద్రయ్య,బోడ వాలి పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన మహిళను హాస్పిటల్లో చేర్పించిన సీఐ

- మానవత్వం చాటుకున్న సీఐ ఇంద్రసేనారెడ్డి



ప్రతిపక్షం ప్రతిపక్షం, గోదావరిఖని, నవంబర్ 8: నిత్యం శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ స్టేషన్కు వచ్చే గొడవలు అల్లర్లు చికాకుతో ఉండే పోలీస్ ఇన్స్పెక్టర్ తమకు కూడా మానవత్వం ఉందని చాటుకున్నారు. గురువారం రాత్రి సిమ్స్ మెడికల్ కాలేజీ సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను ఇంద్రసేనారెడ్డి పోలీసులు, మెడికల్ విద్యార్థుల సహాయంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి మెడికల్ కాలేజ్ ఎదురుగా ఉన్న చెట్ల పొదలలో ఒకరు శరీరానికి మంట అంటించుకొని అరుస్తూన్నారని మెడికల్ కాలేజీ విద్యార్థులు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి కి సమాచారం అందించగావెంటనే ఇన్స్పెక్టర్ స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అక్కడ ఒక మహిళ సగం కాలిన శరీరంతో ప్రాణాపాయ స్థితిలో ఉండడాన్ని గమనించిన సీఐ, సిబ్బంది, మెడికల్ కళాశాల విద్యార్థుల సహాయంతో స్వయంగా అట్టి మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

నా కొడుకు మెడ విరగ్గొట్టారు

- జాతీయ కమీషన్ కు రియాజ్ తల్లి ఫిర్యాదు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 8 : కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో షేక్ రియాజ్ ఎన్‌కౌంటర్ బూటకమని రియాజ్ తల్లి ఢిల్లీ లో మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గత నెల అక్టోబర్ 17 న కానిస్టేబుల్ ప్రమోద్ ను కత్తితో పొడిచి, హతమార్చినట్లు ఆరోపణలు ఎదుర్కొని పోలీసుల చేతిలో ఎన్‌కౌంటర్ అయిన ఘటన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా పోలీసులపై రియాజ్ తల్లి తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. ఈమేరకు ఆమె జాతీయ మహిళా కమిషన్ ను ఆశ్రయించారు. కుమారుడితో పాటు, తమ కుటుంబంపై పోలీసులు అమానుష దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసును సుమోటోగా తీసుకోవాలని కమిషన్‌కు ఆమె భావోద్వేగంతో విన్నవించారు. రియాజ్‌ను పోలీసులు దారుణంగా చంపేశారని ఆ తల్లి ఆరోపించారు. రియాజ్ మెడ విరిచేశారని, పొట్టలో నుంచి పేగులు బయటకొచ్చాయని ఆవేదనతో చెప్పుకొచ్చారు. అసలు కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసింది తన కొడుకు రియాజ్ కాకపోవచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ప్రమోద్ హత్యోదంతంపై లోతుగా విచారణ జరపాలని విన్నవించారు. తన కొడుకే హంతకుడు అయితే ఆధారాలు చూపించాలని ఆమె కోరారు.



ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు


ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 8: గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో శనివారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఎం జన్మదిన కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు పంచారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి హాజరై జన్మదిన కేకును వారి చేతుల మీదుగా కట్ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలను అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల ఉచిత కరెంటు,500 గ్యాస్ కలెక్షన్స్,సన్న బియ్యం,10 లక్షల రూపాయల ఆరోగ్య శ్రీ పథకాలను అమలు చేస్తూ,రైతు భరోసా లాంటి సంక్షేమాలను దిగ్విజయంగా అమలు చేస్తూ పేదల పక్షపాతిగా నిలిచారని అన్నారు. బీసీలకు న్యాయం చేయాలని సంకల్పంతో 42 శాతం రిజర్వేషన్ సాధించాలని అసెంబ్లీలో తీర్మానం చేయించడం జరిగింది.ఎస్సీ వర్గీకరణ దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా నిలవడం,సంక్షేమ సారధిగా రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్న రేవంత్ రెడ్డి పక్షాన రాష్ట్ర ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దిటి బాలరాజు, గట్ల రమేష్,ఎండి ముస్తఫా,బొమ్మక రాజేష్,నాయిని ఓదెలుయాదవ్,సింహాచలం, ఉమాదేవి,సాంబమూర్తి,మాలెం మధు,ఉల్లంగుల రమేష్,చుక్కల శ్రీనివాస్,ధోలికట్ట సతీష్, పంజా శ్రీనివాస్,దాసరి విజయ్,చెరుకు బుచ్చిరెడ్డి,గజాబింకర్ బాబు, శివ,గుడికందుల రవి, శ్రీనివాస్ రెడ్డి,శోభ, స్వప్న,హవీద్, రమేష్, గడ్డం శ్రీనివాస్,దశరథం, భూషణ్ గౌడ్,తదితరులు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా ప్రపంచ రేడియాలజీ డే వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 8: 130 వ ప్రపంచ రేడియాలజీ డే వేడుకలు శనివారం సింగరేణి ఏరియా హాస్పిటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం సింగరేణి ఏరియా హాస్పిటల్లో రేడియలాజీ రోజును హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ బి.అంబిక పాల్గొని కేక్ కట్ చేశారు. డాక్టర్ అంబిక మాట్లాడుతూ ఈ రోజు డాక్టర్ డబ్ల్యూసీ రాంటీజెన్ ఎక్సరే కిరణాలను ఆవిష్కరించిన సందర్భాన్ని ప్రపంచ వ్యాప్తంగా రేడియాలజీ డే గా జరుపుకుంటారని అన్నారు. భద్రత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని పేషెంట్లకు అత్యున్నత సేవలను అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రసన్నకుమార్, డీవైసీఎంఓ డాక్టర్ విష్ణుమూర్తి పాథాలజిస్ట్, డాక్టర్లు రమేష్ మద్దిలేటి, వి శ్రీనివాస్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జీడుల శ్రీనివాస్, సీనియర్ టెక్నీషియన్ సొసైటీ ఆఫ్ ఇండియన్ గ్రాఫర్స్ అసోసియేషన్ తెలంగాణ ఉపాధ్యక్షులు యాదవ రెడ్డి, సీనియర్ టెక్నీషియన్లు బీడీ శాస్త్రి, ముక్తార్ అహ్మద్, రేడియో గ్రాఫర్స్ ఆఫీస్ సూపర్వైజర్ బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సూపర్ బజార్ ను సందర్శించిన జీఎం



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 8: గోదావరిఖనిలోని సింగరేణి సూపర్ బజార్ ను శనివారం ఆర్జీ వన్ జీఎం లలిత్ కుమార్ అస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం సూపర్ బజార్లో స్టాక్ గొడౌన్, వస్తువుల విక్రయాలు, కౌంటర్ లో కొనుగోలు జరుగుచున్న విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. జీఎం వెంట ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మద్దీ ఎల్లయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సూపర్ బజార్ డీయం తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పీఓ శ్రావణ్ కుమార్, సూపర్ బజార్ స్టాఫ్ పాల్గొన్నారు.

రాజ్ ఠాకూర్ ప్రమేయంతోనే మైసమ్మ ఆలయాల కూల్చివేత

- రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ సంధ్యారాణి



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 8: మైసమ్మ ఆలయాల కూల్చివేత ఘటనలో నూటికి నూరు శాతం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ప్రమేయం ఉందని బీజేపీ నాయకులు ఆరోపించారు.ఈ ఘటనకు ఎమ్మెల్యేకు సంబంధం లేదని రాజ్ ఠాకూర్ బినామీలు చెబుతున్న మాటలు పూర్తిగా అవాస్తవమని ఖండించారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ కందుల సంధ్యారాణి మాట్లాడుతూ ఎమ్మెల్యే కనుసనల్లో పనిచేస్తున్న కార్పొరేషన్ శాఖ అధికారులు, పోలీసులు ఏకపక్షం గా ఆలయాల కూల్చివేతకు పాల్పడ్డారనే అసత్యాన్ని ఎవరూ నమ్మే పరిస్థితి లేదని సూచించారు. రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి రామగుండంలో అధికార దుర్వినియోగం అధికమవుతుందని మండిపడ్డారు. పదవి కాలం ముగిసినప్పటికీ కొందరు కార్పొరేటర్లు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం, ఎమ్మెల్యే సతీమణి ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తుండడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రామగుండం బి పవర్ హౌస్ గడ్డ పై కడుతున్న గుడిని ఎమ్మెల్యే ఏటీఎం గా వాడుకుంటూ కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆలయాల కూల్చివేతకు తనకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్న ఎమ్మెల్యే.. ఇదే వాస్తవం అయితే తడి బట్టలతో పోచమ్మ గుడి లోకి రావాలని సవాల్ విసిరారు. జరిగిన తప్పిదానికి బాధ్యత వహించి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆలయాల కూల్చివేతకు పాల్పడిన అడిషనల్ కలెక్టర్ ను తక్షణమే సస్పెండ్ చేసి, కూల్చి వేసిన ఆలయాలను పునర్ నిర్మించాలని కోరారు. బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఆలయాల కూల్చివేతకు ఎమ్మెల్యే కు సంబంధం లేదని చెబుతున్న అధికార పార్టీ నాయకులు ఎందుకని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, వాస్తవాలను బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. రెండున్నర కోట్ల రూపాయల ఆస్తిని తన అఫిడవిట్లో చూపిన ఎమ్మెల్యే బి పవర్ హౌస్ గడ్డపై నిర్మిస్తున్న గుడికి 20 కోట్ల రూపాయల తన సొంత డబ్బులను ఎలా వెచ్చిస్తున్నారని నిలదీశారు. ఆలయాల కూల్చివేత ఘటనపై సిట్ ద్వారా విచారణ జరిపి నిజానిజాలను నిగ్గు తేల్చాలని, ఘటనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ను కోరారు. ఈ మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు మెరుగు హనుమంతు గౌడ్, కోమల్ల మహేష్, జక్కుల నరహరి, సులువ లక్ష్మీనరసయ్య, మడికొండ శ్రీనివాస్, భూమయ్య, అపర్ణ, సుభాష్, రమేష్, రాజ్ కుమార్, శ్యామ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బాలానగర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8: రైతులు తాము కష్టపడి పండించిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలానగర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు.ముందుగా రైతులు కొనుగోలు కేంద్రంలో పోసుకున్న ధ్యానం కుప్పలను పరిశీలించి, ధాన్యం ఎప్పుడు తీసుకువచ్చారు? స్థానికంగా కల్పించిన వసతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా లో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యం లో మొత్తం 238 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 48,325 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. సరైన తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామక్రిష్ణ, అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కళోత్సవాల్లో కరీంనగర్ జిల్లాకు 4 మొదటి స్థానాలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 8: విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు నాలుగు ప్రథమ బహుమతులు సాధించారు. ఇందులో రెండు స్థానాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, మరో రెండు స్థానాలు ప్రైవేటు విద్యార్థులు సాధించారు. మొత్తం 12 రంగాల్లో పోటీలు నిర్వహించగా అందులో నాలుగు రంగాల్లోనూ కరీంనగర్ విద్యార్థులే విజయం సాధించడం విశేషం. థియేటర్ ఆర్ట్స్ గ్రూపులో తిమ్మాపూర్ కేజీబీవీ విద్యార్థులు, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ లో వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థి క్లాసికల్ సోలో పాటల విభాగంలో, పారమిత విద్యార్థి సంగీత విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. వీరంతా త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి కళోత్సవ్ పోటీల్లో పాల్గొంటారు.



అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ అధికారంలో ఉండాలి


- రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్
- ఘనంగా సీఎం పుట్టినరోజు వేడుకలు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 8: అభివృద్ధి, సంక్షేమం కావాలంటే మరో 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలి అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త నుంచి ఒక్కో మెట్టు ఎదుగుతూ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన నాయకుడు రేవంత్ రెడ్డి అని అన్నారు. అందుకే అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. నిత్యం ప్రజల కోసం శ్రమించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలని ఆ భగవంతుడు ప్రసాదించాలి అని అన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన అప్పులు తీర్చుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దం లక్ష్మి, పూజల గోపికృష్ణ, మార్క సతీష్ గౌడ్, సాకి ఆనంద్, గ్యాదరి మధు దాస అంజయ్య, చాంద్ మియా, గయాజుద్దీన్, వహాబ్, రషద్, హర్షద్, అజ్మత్, చెంది శ్రీనివాస్, మార్క పద్మ, రేణుక, పద్మా రెడ్డి, కవిత, సంతోషి, బీజాన్ బి , విజయ, డానియల్ తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లి హత్య



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 8: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలని మద్యం మత్తులో నవమాసాలు మోసిన తల్లిని కొడుకు తలపై కట్టేతో కొట్టి హత్య చేసిన విషాద ఘటన మెదక్ జిల్లా టేక్మల్ మండలం వెలుపుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. వేల్పుగొండ గ్రామానికి చెందిన మోహన గారి సత్యమ్మ (56) కూలి పనులు చేసుకుంటూ జీవన కొనసాగిస్తుంది. తన కుమారుడు సుదర్శన్ వేధింపులు తట్టుకోలేక అతని భార్య మూడు సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడుకు బానిసైన సుదర్శన్ తాగడానికి డబ్బులు ఇవ్వాలని, లేదంటే పుట్టింటికి వెళ్లిన తన భార్యను తీసుకురావాలని తల్లి సత్యమ్మతో ప్రతిరోజు గొడవ పడుతుండేవాడు. తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడం. భార్యను తీసుకురావడానికి తల్లి ఒప్పుకోకపోవడంతో కట్టెతో కొట్టడంతో అక్కడికక్కడే సత్యమ్మ శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంటకు మృతి చెందింది. తన తల్లిని కట్టెతో కొట్టిన విషయాన్ని తన అక్క అనురాధకు ఫోన్ చేసి చెప్పడంతో శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తన తల్లి మృతి చెందిందని మృతురాలు కూతురు తెలిపింది. తల్లి చనిపోయిందని విషయం తెలుసుకున్న సుదర్శన్ ఊరు విడిచి పారిపోయాడు. కూతురు అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టేక్మాల్ ఏఎస్ఐ కృష్ణ తెలిపారు.



"

ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ₹5,942 కోట్లతో దేశంలోనే రెండో అతిపెద్ద సోలార్ సెల్, మాడ్యూళ్ల ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. దీనికోసం 2005లో నాయుడుపేట ఇండస్ట్రీయల్ పార్కులో 269 ఎకరాలు కేటాయించాం. 5జీడబ్ల్యూ సిలికాన్ ఇంగోట్, 4డబ్ల్యూ టాప్‌కాన్ సోలార్ సెల్ యూనిట్లు నెలకొల్పుతాం. దీనిద్వారా 3500మందికి ఉపాధి లభిస్తుంది.

- ఏపీ మంత్రి లోకేశ్

ప్రాంతీయం



ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 8: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలోనీ డీసీసీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రగతికి దిశానిర్దేశకుడైన, ప్రజల మనసులు గెలుచుకున్న నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డని, యువతకు ప్రేరణగా నిలుస్తూ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. శ్రీహరి రావు కేకు కట్ చేసి నిర్మల్ ,సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు సోమ భీమ్ రెడ్డి ,అబ్దుల్ హాది లకు తినిపించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ప్రజా నాయకునికి భగవంతుడు దీర్ఘాయుష్షు కలిగించాలని, ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 8: హనుమకొండ జిల్లా పరిధిలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి శనివారం పరిశీలించారు. ధర్మసాగర్ మండలం ఉనికి చర్ల, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అమ్మకానికి ధాన్యాన్ని తీసుకు వచ్చిన రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు, కొనుగోలు ప్రక్రియ సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు.



ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 8: గుండాల మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పొదెం వీరయ్య, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడెం ముత్యం చారి మాట్లాడుతూ, "ప్రజాహిత నాయకుడు,ధైర్యసాహసాలతో కూడిన ఉద్యమ వీరుడు, ప్రజల కోసం ఎల్లప్పుడూ పోరాడే నాయకుడు అనుముల రేవంత్ రెడ్డి దీర్ఘాయుష్మంతులు కావాలని, ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము" అని తెలిపారు.అలాగే ప్రజల సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి పథకాలు అమలు చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొంబోయిన ముత్తయ్య, ఈసం పాపారావు, కుంజ క్రిష్ణ, ఇర్ప కన్నయ్య, వాంకుడోత్ రమేష్, జోగ రమేష్, సనప సీతారాములు, అరెం బసవయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక గుండాల ఆళ్లపల్లి మండల కమిటీ ఎంపిక


ప్రతిపక్షం, గుండాల (ఆళ్లపల్లి), నవంబర్ 8: ఆళ్లపల్లి మండలం తునికి బండల గ్రామం లో ఈసం ఏసేపు చర్చ్ లో ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక ఆళ్లపల్లి గుండాల మండల కమిటీ నీ శనివారం ఏర్పాటు చేశారు.ఈ కమిటీ లను ఆదివాసీ ఐక్య వేదిక జాతీయ కమిటీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వారి పర్యవేక్షణ లో వారి సూచనలు సలహాలు తో మండల కమిటీ ఏర్పాటు చేశారు. ఆళ్లపల్లి ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక మండల అధ్యక్షులు గా పాయం జాన్ విక్టర్, ఉపాధ్యక్షులు గా ఈసం ఏసేపు, ప్రధాన కార్యదర్శి గా చాట్ల ఏసేపు, పూనెం ఆం ద్రే యా, కోశాధికారి గా గోగ్గేలా లేవి బాబు, సలహాదారులుగా ఈసం వసంత రావు తాటి దానియేలు, మండల కమిటీ సభ్యులు గా కొమరం రామూర్తి, పూనెం సమూయేలు, కాలం వెంకన్న గోగ్గేలా సొలొమోను ఎన్నుకున్నారు. గుండాల ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక మండల అధ్యక్షులు గా అరేం లక్ష్మి నారాయణ,ఉపాధ్యక్షులుగా గోగ్గేలా రామానాదం, ప్రధాన కార్యదర్శి గా బంగారి సంతోష్, సహాయ కార్యదర్శి గా పూనెం లింగయ్య, కమిటీ సభ్యులు గా సనప సుదర్శన్, గోగ్గేలా రాజ్ కుమార్ వూకే రామకృష్ణ నూ ఎన్నుకున్నారు. ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక ఆదివాసీ సమాజాన్ని జాగృతం చేస్తూ, ఏజెన్సీ లో ఆదివాసీ పాస్టర్స్ సమస్యలు పరిష్కారం చేస్తూ, రాజ్యాంగ బద్ద ఆదివాసీ హక్కులు కోసం పోరాడుతూ, ఏజెన్సీ లో ఆదివాసీ పాస్టర్స్ పై జరిగే దాడులు వ్యతిరేకంగా పోరాడుతూ ఆదివాసీ పాస్టర్స్ సంక్షేమం కోసం పని చేస్తూ యేసు క్రీస్తు చూపిన బాటలో నడుస్తూ ఆధ్యాత్మికత నూ బోధిస్తూ ముందుకు వెళ్ళుతుందని ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు కే నిరీక్షణ రావు అన్నారు. ఈ కార్యక్రమం లో ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మడవి ఎలీషా, ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డేవిడ్ సన్, పినపాక నియోజకవర్గం ఆదివాసీ ఐక్య వేదిక అధ్యక్షులు తిమోతి, నియోజక వర్గ నాయకులు సనప మార్క్, పాస్టర్ శైలజ ఆదివాసీ క్రైస్తవ సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శంభునికుంటను కబ్జాదారుల నుండి కాపాడాలి

- గుర్రం డెక్కను,చెత్తను,పిచ్చి మొక్కలను తొలగించి, దోమలను నివారించాలి
- కుంటను ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరించాలి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 8 : అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ లో ఉన్న శంభునికుంటను కబ్జాదారుల నుండి కాపాడి ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరించాలని సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే సంతకాల సేకరణలో ప్రజలు, ప్రజాతంత్ర,వాదులు మహిళలు,యువకులు,పెద్ద ఎత్తున పాల్గొనాలని సిపిఎం సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి అన్నారు. ఈరోజు పార్టీ నాయకులతో కుంటను పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరంగూడ,జయలక్ష్మి నగర్,సాయి కాలనీ, ఇలా అనేక కాలనీలు ఉన్నాయని అన్నారు.కుంట ఇరువైపులా రోడ్డు ఉందని, వేలాదిమంది రోజు పక్కనుండే ముక్కు మూసుకుని ప్రయాణిస్తున్న పరిస్థితి ఉంది అన్నారు.కుంట నిండా కుళ్ళిపోయిన చెత్త,ప్లాస్టిక్ పేపర్లు,పిచ్చి మొక్కలు, డ్రైనేజీ నీటితో పెద్ద ఎత్తున దోమలు దీంతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు మలేరియా,డెంగ్యూ లాంటి రోగాల బారిన పడుతున్న పరిస్థితి ఉంది అని ఆవేదన చెందారు.భారీ వర్షాలు వస్తే కాలనీలో మునిగిపోతున్నాయని,కుంటలోకి నీరు వచ్చే కాలువలు,కుంట నుండి బయటికి పోయే కాలువలు కబ్జా అయ్యాయి అన్నారు.ఇప్పటికే చెరువు సగభాగం కబ్జా అయిన పరిస్థితి ఉందని ఉన్న చెరువునైనా కాపాడి ప్రజలందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత,మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సునీత,పార్టీ సభ్యులు ఎం శ్రీనివాస్ రెడ్డి ,బి అర్జున్,బివిఆర్ కే రాజు, వెంకటేశ్వరరావు,నరేంద్ర,హెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్ట్ గిరి ప్రసాద్ ఆకస్మిక మరణం

- పటాన్‌చెరు జర్నలిస్టుల్లో తీవ్ర దిగ్భ్రాంతి.
- కన్నీరు మున్నీరు అయిన జర్నలిస్ట్ లు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 8 : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో సీనియర్ జర్నలిస్ట్, పలు మీడియా సంస్థల్లో రిపోర్టర్ గా పనిచేసిన గిరి ప్రసాద్ (57) గుండెపోటుతో శనివారం రోజు తెల్లవారుజామున మృతి చెందారు. కర్నూలుకు చెందిన ఆయన గత 20 సంవత్సరాలుగా పటాన్‌చెరు నియోజకవర్గంలో జర్నలిస్టుగా సేవలందిస్తూ, స్థానిక ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి విశ్వసనీయతను సంపాదించారు. ఇటీవలే ఆయన తల్లి మరణించగా, ఆ మరణానికి 20 రోజులు కూడా పూర్తికాకముందే గిరి ప్రసాద్ కన్నుమూయడం జర్నలిస్టు వర్గాలను తీవ్రంగా కలచివేసింది. తల్లి మరణం తరువాత తీవ్ర మనోవేదనలో ఉన్న ఆయన నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు సమాచారం. ఉదయం సహచరులు తలుపు తట్టినా స్పందన రాకపోవడంతో తలుపు తెరిచి చూడగా ఆయన విగతజీవిగా కనిపించారు. గిరి ప్రసాద్ ఆకస్మిక మరణం పటాన్‌చెరు నియోజక వర్గ మీడియా వర్గాలను శోకసంద్రంలో ముంచేసింది. పలువురు జర్నలిస్టులు కన్నీరు మున్నీరు అయ్యారు. ఆయన మరణం జర్నలిస్టులకు తీరని లోటని, ఆయన నిబద్ధత, సేవా భావం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని సహచరులు పేర్కొన్నారు. తన స్వగ్రామమైన కర్నూలు కు గిరి ప్రసాద్ భౌతిక కాయాన్ని తరలించారు. ఈ రోజు ఉదయం తెల్లవారుజామున కర్నూలు లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



జూబ్లీహిల్స్ ప్రచారంలో నర్వ మండల నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 8: జూబ్లీహిల్స్ లో జరుగుతున్న బై ఎలక్షన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ కి మద్దతుగా ప్రచారంలో భాగంగా, వెంగల్ రావు నగర్ డివిజన్ ఇంచార్జ్ రాష్ట్ర మంత్రి పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ప్రచారంలో పాల్గొన్న మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, నర్వ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, నారాయణ పేట జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు నంగి మహేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్, పాతర్ చెడు గ్రామ అధ్యక్షులు మహేష్, నాగిరెడ్డి పల్లి గ్రామ అధ్యక్షుడు చంద్ర శేఖర్, యాంకి గ్రామ అధ్యక్షులు రాము, కుర్వ చిన్న ఆశన్న, కల్వాల్ మాజీ ఎంపీటీసీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.





కాల్వపల్లి తూముల వాగులో ఇసుక తవ్వకాలు

- పర్మిషన్ లేకుండానే ప్రభుత్వ అధికారులు తరలింపు యత్నం
- అడ్డుకున్న గ్రామస్తులు

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 8: ములుగు జిల్లా, తాడ్వాయి మండలం ఏజెన్సీ ప్రాంతమైన కాల్వపల్లి గ్రామంలోని తూముల వాగులో మరోసారి ఇసుక దందా కలకలం రేపింది. గ్రామంలోని బ్రిడ్జి క్రింద భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్థులు గమనించి అక్కడికి చేరుకున్నారు. గ్రామ యువత, పెద్దలు కలిసి ఆ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేయగా, అక్కడ ఉన్న రెవెన్యూ శాఖ అధికారులు "మేడారం గుడి అభివృద్ధి పనుల కోసం ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి" అని సమాధానమిచ్చారు. అయితే గ్రామస్థులు వెంటనే "కలెక్టర్ ఆర్డర్ కాపీ చూపించండి" అని అడిగినప్పటికీ, అధికారులు ఏ ఆధారాలూ చూపించలేక మాట దాటవేశారు. దీంతో అక్కడ వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామ ప్రజలు ఆగ్రహంతో మాట్లాడుతూ "పర్మిషన్ లేకుండా మా వాగులో ఇసుక తవ్వడం చట్ట విరుద్ధం. ఇది ఏజెన్సీ గ్రామం. పేసా చట్టం ప్రకారం ఇక్కడ గ్రామ సభ, పంచాయతీ అనుమతి లేకుండా ఎవ్వరూ ఇసుక తవ్వకాలు చేయరాదు. ప్రభుత్వ అధికారులు సైతం చట్టాలను ఉల్లంఘిస్తే మాకు న్యాయం ఎవరు చేస్తారు?" అని ప్రశ్నించారు. స్థానికులు తెలిపారు, ఈ అక్రమ తవ్వకాలు కొనసాగితే పంటలకు నీటి సరఫరా దెబ్బతింటుంది, బ్రిడ్జి బలహీనమవుతుంది, గ్రామానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని. గ్రామస్థులు అక్కడే ఇసుక తరలింపును అడ్డుకొని, అధికారులు వెళ్లిపోయే వరకు నిలదీశారు. స్థానిక ప్రజలు జిల్లా కలెక్టర్‌ను నేరుగా కలిసి ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, అక్రమ ఇసుక తరలింపులో పాలుపంచుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లన్నీ రక్తసిక్తం...ఆర్అండ్‌బీ ఎక్కడ?

- ములుగు జిల్లాలో రోడ్లపై ప్రయాణం అంటే భయం
- ఇసుక లారీలతో రోడ్లు గుంతల మయం
- ప్రజలు ప్రాణాలు పోతున్నా ఎవరికి పట్టదా?
- తాడ్వాయిలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇసుక లారీ ఢీ – యువకుడు మృతి, మరోకరికి తీవ్ర గాయాలు






ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 8: ములుగు జిల్లా, తాడ్వాయి మండలం 163వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ములుగు జిల్లాలో కలకలం రేపింది. తాడ్వాయి మండలం పరిధిలోని వేపకుంట సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని వెనుకనుంచి వేగంగా దూసుకొచ్చిన ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చిటమట రాజు (28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతని తోటి వ్యక్తి విష్ణు (26) తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వ్యక్తిని 108 ద్వారా తాడ్వాయి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఆసుపత్రికి పంపారు. జిల్లాలో ఇసుక మాఫియా బీభత్సం రోజురోజుకూ పెరుగుతోంది. 163వ జాతీయ రహదారిపై, ములుగు - ఏటూరునాగారం మార్గం, తాడ్వాయి - గోవిందరావుపేట దారులపై ప్రతిరోజూ వందలాది ఇసుక లారీలు అడ్డదిడ్డంగా తిరుగుతున్నాయి. ఈ భారీ వాహనాల కారణంగా రోడ్లు గుంతల మాయమైపోయాయి. వర్షం పడితే గుంతలు కుప్పకూలుతుండగా, ఎండల్లో దుమ్ము కక్కుతూ ప్రయాణం భయంకరంగా మారింది. రాత్రివేళల్లో మాత్రం ఈ లారీలు మరింత వేగంగా పరిగెత్తి ప్రాణాలను బలిగొంటున్నాయి.

ప్రభుత్వం మారినా పరిస్థితిలో మార్పు లేదు!

రాష్ట్రంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి పదవి బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయినా, జిల్లాలో రహదారుల పరిస్థితి మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లు ఉంది. ములుగు నుంచి ఏటూరునాగారం దారి వరకూ గుంతలు, వంకరలతో ప్రయాణం కష్టంగా మారింది. గ్రామీణ రహదారుల సంగతి చెప్పనక్కర్లేదు - ట్రాక్టర్లు, లారీలు దూసుకెళ్తూ పేదల జీవనాన్ని పణంగా పెడుతున్నాయి.

ప్రజల వేదన – అధికారుల నిర్లక్ష్యం!

ప్రతీ ప్రమాదం తర్వాతే పోలీసులు లారీ డ్రైవర్లను పట్టుకోవడమే తప్ప, రహదారి మరమ్మతులు మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల ప్రజలు రోడ్ల పునరుద్ధరణకు పలుమార్లు డిమాండ్ చేసినా స్పందన లేదు. ప్రజలు "రోడ్లు కూలిపోతున్నాయి, ప్రాణాలు పోతున్నాయి, కానీ ఇసుక లారీలు మాత్రం రోజుకి వందల సంఖ్యలో పరిగెడుతున్నాయి" అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ములుగు జిల్లా రోడ్లు ప్రాణాలను పణంగా పెడుతున్నాయి. బాధ్యత వహించాల్సిన అధికారులు నిద్రపోతే, ప్రాణాలు కోల్పోతున్న ప్రజల పట్ల ఎవరు జవాబు చెబుతారని ప్రజలు కన్నీరు పెడుతున్నారు.



కెరీర్ ఆరంభంలో ఆర్థికంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా. సినిమాల్లో అవకాశాలు రాక నిరాశలో కూరుకుపోయా. ఏదైనా మూవీలో ఛాన్స్ వచ్చినా మళ్లీ పోతుందనే భావనలో ఉండేవాడిని. దీంతో ఆత్మహత్య ఆలోచనలూ వచ్చాయి. 2012 నుంచి గ్యాంగ్ ఆఫ్ వాస్సేపూర్, కహానీ, తలాష్ మూవీలు సక్సెస్ కావడంతో జీవితంపై ఆశ చిగురించింది.

- ఓ ఇంటర్వ్యూలో నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ



ప్రధాని మాటల ద్వారా రెచ్చగొడుతున్నారు

- మోడీ మీద మండిపడిన ఎంపీ ప్రియాంకాగాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 8: ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి కాంగ్రెస్ నేత, ఎంపీ ప్రియాంకాగాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తుపాకీ వంటి పదాలను ఉపయోగించి ఆయన తన గౌరవాన్ని పోగొట్టుకుంటున్నారని అన్నారు. తన మాటల ద్వారా ప్రధాని ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఓవైపు ప్రధానమంత్రి అహింసకు నిలయమైన 'వందేమాతరం' పాడుతూనే, ఇంకో వైపు నాటు తుపాకీల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. బిహార్‌లోని కతిహార్‌లో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక మాట్లాడారు. ఒకప్పుడు మహాత్మాగాంధీ చేసిన పోరాటమే ఇప్పుడు కాంగ్రెస్, మహాఘట్‌బంధన్ చేస్తున్నాయన్నారు. ఇది రాజకీయ పోరాటం మాత్రమే కాదని, ఓటు హక్కు సహా పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే పోరాటమని ప్రియాంక వివరించారు. ప్రస్తుతం అది ముప్పులో ఉందన్నారు. ఇప్పటికీ తాము పౌరుల హక్కుల కోసం, సత్యం కోసం నరేంద్ర మోడీ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. ఆయన ప్రజలను అణచివేసే పద్ధతులతో ఈ దేశాన్ని నడుపుతున్నారని, ఆయన పార్టీ వదంతులను, గాలి వార్తలను వ్యాప్తి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య ప్రక్రియను బలహీనపరిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని, ప్రభుత్వ రంగ సంస్థలను ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకు అప్పగిస్తోందని విమర్శించారు.

విశ్వ వీక్షణం



పాక్ అణుకేంద్రంపై దాడిని ఇందిర అడ్డుకున్నారు

- అమెరికా ఇంటెలిజెన్స్ మాజీ అధికారి రిచర్డ్ బార్లో

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 8: అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి రిచర్డ్ బార్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. దాయాది పాకిస్తాన్ అణ్వాయుధ ఆశయాన్ని అడ్డుకునేందుకు భారత్-ఇజ్రాయెల్ కలిసి చేసిన రహస్య ప్రణాళికను అప్పటి ప్రధాని ఇందిర తిరస్కరించినట్లు చెప్పారు. పాక్‌లోని కహూతా అణుకేంద్రాన్ని బాంబులతో ధ్వంసం చేసేందుకు రూపొందించిన ఈ ఆపరేషన్‌కు ఇందిర ఆమోదం తెలిపి ఉంటే ప్రపంచానికి ఎన్నో సమస్యలు తప్పి ఉండేవని ఆయన అభిప్రాయపడ్డారు. 1980లో పాకిస్తాన్ రహస్య అణు కార్యకలాపాలను అభివృద్ధి చేస్తున్న సమయంలో అమెరికన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో బార్లో పనిచేశారు. అయితే, ఆసమయంలో ఈ ప్రణాళిక గురించి తాను విన్నట్లు తెలిపారు. ఇందిరాగాంధీ ఆపరేషన్‌ను ఆమోదించి ఉంటే చాలా సమస్యలు పరిష్కారమయ్యేవన్నారు. పాక్‌లోని కహూతా అణుకేంద్రాన్ని బాంబులతో ధ్వంసం చేసేందుకు ఇజ్రాయిల్, భారత్ ప్లాన్ చేశాయి. అణ్వాయుధాలను పాక్ అభివృద్ధి చేయకుండా, వాటిని ఇతర దేశాలకు అందించకుండా నిరోధించేందుకు దాడి చేయాలని ప్రణాళికనూ రచించాయి. అయితే, ఈ రహస్య ఆపరేషన్‌ను అప్పటి భారత ప్రభుత్వం అడ్డుకుంది. అణు కార్యక్రమ రూపశిల్పి ఏక్యూ ఖాన్ నేతృత్వంలో అభివృద్ధి చెందిన ఆ కహూతా కేంద్రం, చివరికి పాకిస్తాన్‌ను అణ్వస్త్ర దేశంగా మార్చింది. 1998లో పాక్ తొలి అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే.

ఎలన్ మస్క్‌కు 88 లక్షల కోట్ల ప్యాకేజీ

- ఇవ్వడానికి ముందుకు వచ్చిన 'టెస్లా' కంపెనీ

న్యూయార్క్ (అమెరికా), నవంబర్ 8: మనదేశంలో అత్యధిక వేతనాలు తీసుకొనే ప్రైవేట్ కంపెనీల అధినేతలలో ముకేశ్ అంబానీ, కావేరి మారన్, రోషిణి నాదార్, ఆనంద్ మహీంద్రా ముందు వరసలో ఉంటారు. వీరి వార్షిక వేతనం కోట్లలో ఉంటుంది. యేటా వీరి వేతనం పెరుగుతూనే ఉంది. పెరిగిన వేతనం ద్వారా వీరు రికార్డులు సృష్టిస్తూనే ఉన్నారు. కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త ఘనతలను అందుకుంటునే ఉన్నారు. మన దేశం గురించి కాస్త పక్కన పెడితే, ప్రపంచంలోనే అత్యధిక వేతనం తీసుకుంటున్న వ్యక్తిగా రికార్డ్ సృష్టించాడు టెస్లా అధినేత మస్క్ టెస్లా ఎక్స్, స్పేస్ ఎక్స్ కంపెనీల అధినేతగా ప్రపంచ కుబేరుడిగా పేరుపొందాడు మస్క్. ఇంకా తన వ్యాపారాలను మరింత స్థాయికి విస్తరించడానికి ఆయన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టెస్లా కార్ల విక్రయాల ద్వారా సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు.



అటువంటి మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారం లోకి కూడా అడుగు పెట్టారు. త్వరలోనే భారతదేశంలో సేవలు అందించబోతున్నారు. దీనికి సంబంధించి అనుమతులు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో మస్క్ మరో రికార్డు సృష్టించారు. కార్పొరేట్ ప్రపంచం కనీ విని ఎరుగని ఘనతను అందుకున్నారు. ఆయనకు వన్ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి టెస్లా కంపెనీకి చెందిన 75 శాతం షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు. వన్ ట్రిలియన్ డాలర్లు అంటే దాదాపు 88 లక్షల కోట్లు. ఫలితంగా కార్పొరేట్ ప్రపంచంలో అత్యధిక వేతనం అందుకుంటూ ఆయన చరిత్ర సృష్టించాడు. అయితే దీనిని నెల జీతం గా కాకుండా, ఆ మొత్తాన్ని వచ్చే పదేండ్లలో రూపంలో ఆయన పొందుతారు.

మహారాష్ట్రలో భూకుంభకోణాల కలకలం

- మంత్రులపైనే నేరుగా తీవ్ర ఆరోపణలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, నవంబర్ 8: మహారాష్ట్రలో వరుసగా భూ కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తనయుడు పార్థ పవార్‌కు చెందిన సంస్థకు రూ.1800 కోట్ల విలువైన భూమిని రూ.300 కోట్లకే కేటాయించారనే ఆరోపణలు వచ్చాయి. ఇది రాష్ట రాజకీయాలలో తీవ్ర దుమారం రేపుతోంది. సరిగా ఈ సమయంలోనే మరో భూ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ.200 కోట్ల విలువైన భూమిని రూ. మూడు కోట్లకే దక్కించుకున్నారని కాంగ్రెస్ మరో తీవ్ర ఆరోపణ చేసింది. ఓ విద్యాసంస్థను ఏర్పాటు చేయండ కోసం మంత్రి మీరా భయందర్‌లో దాదాపు నాలుగెకరాల భూమిని తక్కువకే కొనుగోలు చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ వెల్లడించారు. అయితే, ఈ ఆరోపణలపై మంత్రి చంద్రశేఖర్ బవాంకులే మాట్లాడుతూ, దీని గురించి తాను కూడా విన్నానని కానీ, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి



ఫిర్యాదులు రాలేదని పేర్కొన్నారు. ఆధారాలు ఉంటే చూపించాలని సూచించారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయకుండా, మీడియా ముందుకొచ్చి ఆరోపణలు చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఫిర్యాదు అందితే తాము తప్పక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పుణే ముద్వా ప్రాంతంలో ఉన్న 40 ఎకరాల 'మహర్ వతన్' భూమిని, నిరభ్యంతర పత్రం లేకుండానే అమేడియా ఎంటర్‌ప్రైజెస్‌కు విక్రయించినట్లు అధికారులు తెలిపారు. అది ప్రభుత్వ భూమి అని, దాన్ని ప్రభుత్వేతర సంస్థలకు అమ్మడానికి వీలు లేదని వారు వివరించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇప్పటికే ప్రకటించారు.

జమ్ముకశ్మీర్‌లోని కుప్వాడాలో ఎన్‌కౌంటర్

- ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చిన భారత దళాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, నవంబర్ 8: జమ్ముకశ్మీర్‌లోని కుప్వాడా సరిహద్దు ప్రాంతంలో ఉగ్రవాదుల చొరబాటును భారత సైన్యం నివారించింది. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పులలో ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు. ఆ ప్రాంతంలో ఎదురు కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని సైనిక ఉన్నతాధికారులు వెల్లడించారు. కెరాన్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదులు చొరబాటుకు యత్నిస్తున్నారనే సమాచారం శుక్రవారం నిఘా వర్గాల నుంచి అధికారులకు అందింది. దీంతో వెంటనే 'ఆపరేషన్ పింపుల్' కింద భారత్ ఆర్మీకి చెందిన దళాలు కీలక తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం ఉగ్రవాదులు ఎదురుపడి కాల్పులకు దిగారు. వెంటనే అప్రమత్తమైన మన సైనికులు ఎదురు కాల్పులు జరపడంతో ఇద్దరు ఉగ్రవాదులు అక్కడిక్కడే హతమయ్యారు. అంతకు మూడు రోజుల ముందు కిష్తివాడ్ జిల్లా ఛత్రులోని కల్బన్ అటవీ ప్రాంతంలో మరొక ఎన్‌కౌంటర్ జరిగింది. అక్కడ ముగ్గురు ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. సమాచారం అందుకున్న వెంటనే భారత సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, కశ్మీర్ పోలీసుల సంయుక్త బృందాలు 'ఆపరేషన్ ఛత్రు' ప్రారంభించాయి. ఉగ్రవాదులను చుట్టుముట్టి వారిని హతమార్చాయి. జూలైలో జమ్ముకశ్మీర్‌లో భద్రతా దళాలు చేపట్టిన 'ఆపరేషన్ మహాదేవ్'లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు.

సింగిడి
హైదరాబాద్
ఆదివారం
09.11.2025

ప్రతిపక్షం
Prathipaksham.in


కొంతమంది నీరసంగా, బలం లేకుండా ఉంటారు. ఇలాంటి వారు ఏ చిన్న పనిచేసినా పూర్తిగా అలసిపోతారు. అయితే కొన్ని రకాల ఆహారాలను తింటే మీకు వెంటనే బలం వస్తుంది. ఎనర్జిటిక్‌గా మారిపోతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



మనం తినే ఆహారమే మన ఆరోగ్యం ఎలా ఉండాలో డిసైడ్ చేస్తుంది. అయితే కొంతమంది తినాల్సిన దానికంటే చాలా తక్కువగా తింటారు. లేదా ప్రోటీన్లను చాలా తక్కువ మొత్తంలో తీసుకుంటారు. దీనివల్ల ఒంట్లో శక్తి ఉండదు. శరీరం నీరసంగా, బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి వారు ఏ పనిచేయలేరు.

ఏ చిన్న పనిచేసినా వెంటనే అలసిపోతారు. అయితే కొన్ని రకాల ఆహారాలను తింటే మీ శరీరం తిరిగి బలంగా అవుతుంది. అలాగే వెంటనే మీకు శక్తి అందుతుంది. వీటిని రోజూ తింటే మీ శరీరం బలంగా మారుతుంది. ఎలాంటి రోగాలు లేకుండా ఉంటారు.

ఇన్‌స్టంట్ ఎనర్జీ కావాలా?



గుడ్డు

గుడ్డు మంచి పోషకాహారం. వీటిని మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ లో తింటే మీరు రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటాయి. గుడ్లలో ప్రోటీన్లు, కోలిన్, ఎసెన్షియల్ అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ శరీర స్టామినాను పెంచడానికి ఎంతగానో సహాయపడతాయి. రోజూ ఒక ఉడకబెట్టిన గుడ్డును తింటే మీరు హెల్తీగా ఉండటంతో పాటుగా మీ ఏకాగ్రత కూడా పెరుగుతుంది.



అరటిపండు

అరటిపండ్లు ఏ సీజన్లో అయినా సరే మార్కెట్ లో దొరుకుతాయి. ఈ పండ్ల ధర ఎక్కువ కాకపోయినా.. వీటిని తింటే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అరటిపండ్లలో మన శరీరానికి మేలు చేసే ఎన్నో రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అరటి పండ్లలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ బి, థయామిన్, నియాసిన్, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్ లు మీ శరీరానికి మంచి శక్తిని అందిస్తాయి. వీటిని తింటే తక్షణమే ఎనర్జీ అందుతుంది.



డార్క్ చాక్లెట్

డార్క్ చాక్లెట్ ను ప్రతి ఒక్కరూ ఇష్టంగా తింటారు. ఇది టేస్టీగా ఉండటమే కాకుండా.. మన ఆరోగ్యానికి కూడా ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. ముఖ్యంగా ఇది బలహీనంగా ఉన్నవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. డార్క్ చాక్లెట్లో థియోబ్రోమైన్ అనే రసాయనం ఉంటుంది. ఇది కెఫిన్ లాగే మంచి ఎనర్జీని, మానసిక ప్రశాంతతను అందిస్తుంది.




బాదం పప్పు

బాదం పప్పుల్లో కూడా మన శరీరానికి ప్రయోజనకరంగా ఉండే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బాదం పప్పుల్లో ఫైబర్, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇది మీ శరీరానికి మంచి స్టామినాను అందిస్తాయి. అలాగే బాదం పప్పులు పోషకాల లోపాలను కూడా పోగొడుతాయి.



ఓట్ మీల్

ఓట్ మీల్ కు మించిన మంచి బ్రేక్ ఫాస్ట్ ఉండదు. ఎందుకంటే ఇది మన శరీరానికి అవసరమైన ఎన్నో రకాల పోషకాలను అందిస్తుంది. అలాగే రోజుకు అవసరమైన శక్తిని కూడా అందిస్తుంది. ఓట్స్ లో విటమిన్ బి, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మీకు స్థిరమైన స్టామినాను అందిస్తాయి.



పల్లీలు

పల్లీలు కూడా మన ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తాయి. వీటిలో ప్రోటీన్లు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి అవసరమైన శక్తిని అందించి స్టామినాను పెంచుతాయి.

పుల్లని పండ్లు

నిమ్మకాయ, నారింజ, ఉసిరి వంటి పుల్లని పండ్లు మన ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. వీటిలో విటమిన్ బి 6, కాల్షియం, ఫైబర్, ఫోలేట్, థయామిన్ లు మెండుగా ఉంటాయి. ఇవి మన శరీర స్టామినాను బాగా పెంచుతాయి. అలాగే ఇమ్యూనిటీ పవర్ ను పెంచడానికి బాగా సహాయపడతాయి. వీటిని తింటే రోగాలొచ్చే ముప్పు తగ్గుతుంది.



ఆసిస్ తో చివరి టీ20 కూడా వర్షార్పణం

- 2-1తో సిరీస్ టీమిండియా కైవసం

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్ ను టీమిండియా 2-1తో కైవసం చేసుకుంది. బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో శనివార జరిగిన ఆఖరి టీ20 వర్షం కారణంగా రద్దయ్యింది. తొలి మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దు చేసిన విషయం తెలిసిందే. మూడు వన్డేల సిరీస్‌ను 1-2తో కోల్పోయిన భారత్, టీ20 సిరీస్‌ను కైవసం చేసుకొని ఈ పర్యటనను విజయవంతంగా ముగించింది. ఆఖరి టీ20లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ మ్యాచ్ ఆగిపోయే సమయానికి 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ 29 (బ్యాటింగ్), అభిషేక్ శర్మ 23 పరుగులతో దూకుడుగా ఆడారు. కాగా, బెన్ ద్వార్షూయిస్ వేసిన తొలి ఓవర్‌లోనే ఐదు పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అభిషేక్ శర్మ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను గ్లేన్ మ్యాక్స్‌వెల్ వదిలేశాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో ఇచ్చిన మరో ఈజీ క్యాచ్‌ను ద్వార్షూయిస్ కూడా నేలపాలు చేశాడు. దీంతో అభిషేక్ శర్మ చెలరేగి ఆడాడు. మరుసటి బంతికే సింగిల్ తీసి టీ20లో 1000 పరుగులను పూర్తి చేసుకున్నాడు. టీ20లలో అత్యంత వేగంగా ఈ ఘనతను సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. గత మూడు మ్యాచులలో విఫలమైన శుభ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌లో మాత్రం స్వేచ్ఛగా ఆడాడు. ఈ క్రమంలో అక్కడ వాతావరణం మందగించింది. వర్షం రాకపోయినా, మైదానాన్ని గాఢంగా మబ్బులు కమ్మేశాయి. భారీ ఉరుములతో కూడిన గాలివాన వస్తుందనే హెచ్చరికల నేపథ్యంలో అంపైర్లు ఆటను నిలిపేసారు. ఆ తరువాత కొద్దిసేపటికే భారీ వర్షం కురవడంతో ఆట తిరిగి నిర్వహించడం సాధ్యం కాలేదు. వర్షం మరింత పెరగడంతో ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.



హాంగ్ కాంగ్ టోర్నీలో భారత్ దారుణ ఓటమి

- 27 పరుగుల తేడాతో కువైట్ విజయం

హాంగ్ కాంగ్ ఇంటర్నేషనల్ సిక్సెస్ టోర్నీలో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలిపింది. పసికూన కువైట్‌తో శనివారం నాడు జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 27 పరుగుల తేడాతో ఓడింది. కువైట్ కెప్టెన్ యాసిన్ పటేల్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్ కు పరాజయం తప్పలేదు. ముందుగా బ్యాటింగ్ చేసిన కువైట్ నిర్ణీత ఆరు ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. కెప్టెన్ యాసిన్ పటేల్ 58 (నాటౌట్) బిలాల్ తాహిర్ 25 పరుగులు చేశారు. భారత బౌలర్లలో స్టువర్ట్ బిన్నీ, నదీమ్, దినేశ్ కార్తీక్ తలా ఒక్కో వికెట్ తీశారు. మిథున్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 5.4 ఓవర్లలో 79 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. ప్రియాంక్ పాంచల్ 17, అభిమన్యు మిథున్ 26, షెహ్‌బాజ్ నదీమ్ 19 పరుగులు చేశారు. ఓపెనర్ రాబిన్ ఊతప్ప డకౌట్ కాగా, కెప్టెన్ దినేశ్ కార్తీక్ 8, స్టువర్ట్ బిన్నీ 2 పరుగులు మాత్రమే చేయగలిగారు. కాగా, కువైట్ బౌలర్లలో కెప్టెన్ యాసిన్ పటేల్ మూడు, బిలాల్ తాహీర్, అద్నాన్ ఇద్రీస్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ ఓటమితో టీమిండియా టోర్నీ నుంచి నిష్క్రమించింది. కువైట్, పాకిస్తాన్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాయి. పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో మాత్రమే భారత్ గెలిచింది. మిగతా రెండు జట్లు కూడా ఒక్కో మ్యాచ్ గెలిచినప్పటికీ మెరుగైన రన్‌రేట్‌తో ముందుకు దూసుకెళ్లాయి. కువైట్ చేతిలో ఓటమి టీమిండియా రన్‌రేట్‌ను దిగజార్చింది. శనివారమే యూఏఈతో జరిగిన బౌల్ మ్యాచ్‌లోనూ భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది, దాంతో ఈ టోర్నీలో భారత కథ ముగిసింది.



మహిళా క్రికెట్‌లో ఐసీసీ కీలక నిర్ణయాలు

- ఇక నుంచి ప్రపంచ కప్ లో 10 జట్లు ఆడే అవకాశం

భారత మహిళల జట్టు వన్డే ప్రపంచ కప్ గెలిచిన తదుపరి ఐసీసీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. విశ్వవిజేతగా నిలిచిన జట్టుకు ఇప్పటికే భారీగా నగదు నజరానా ప్రకటించింది. 51 కోట్ల రూపాయలు ఇస్తామని వెల్లడించింది. ఇప్పుడు తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై వుమెన్స్ వరల్డ్ కప్ లో 10 జట్లు ఆడనున్నాయి. 2029 నుంచి ఇది అమలులోకి రానుందని ఐసీసీ అధికారికంగా తెలిపింది. ప్రస్తుతం ఈ టోర్నమెంట్ ఎనిమిది జట్లకు మాత్రమే పరిమితమై ఉంది. మహిళల వరల్డ్ కప్‌కు లభిస్తోన్న అపూర్వ ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఈ సంఖ్యను పెంచాలని ఐసీసీ అనుకుంటోంది. ఈ ప్రపంచకప్‌లో దాదాపు మూడు లక్షల మందికి పైగా అభిమానులు ప్రత్యక్షంగా మ్యాచులను వీక్షించారు. టీవీ, యూట్యూబ్, యాప్ వంటి ప్లాట్ ఫామ్‌ల ద్వారా మ్యాచులను తిలకించిన ప్రేక్షకుల సంఖ్య అదనం. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మహిళల క్రికెట్ పట్ల ఆసక్తి చూపారు. ఇటువంటి ఆదరణ గతంలో ఎప్పుడూ లేదు. ఇది మహిళల క్రికెట్ కు సంబంధించిన అన్ని రకాల టోర్నమెంట్ రికార్డులను బద్దలు కొట్టింది. ప్రపంచవ్యాప్తంగా టీవీ వీక్షకులలో కొత్త రికార్డులను నెలకొల్పింది. దాదాపు 500 మిలియన్ మంది ఈ టోర్నమెంట్‌ను వీక్షించారు. 2029 నాటికి ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఐసీసీ భావిస్తోంది. అందుకే, విమెన్స్ వరల్డ్ కప్ ను విస్తరించాలని, 10 జట్లతో ఆడేలా కార్యాచరణ రూపొందించాలని అనుకుంటోంది.



ఆసియా కప్ ట్రోఫీ ఇక భారత్ కు అందదా!!

- కమిటీ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న ఐసీసీ

ఆసియా కప్ లో పాకిస్తాన్ పై ఘన విజయం సాధించిన భారత్ కు ఇప్పటికీ ఆ ట్రోఫీ అందలేదు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ గా ఉన్న మొహసిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ అందుకునేందుకు టీమిండియా నిరాకరించింది. దీంతో ఆయన ట్రోఫీని తన వెంట తీసుకెళ్లిపోయారు. ఐసీసీ సమావేశంలో ఈ ట్రోఫీ వ్యవహారం తేలుస్తామంటూ బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పినప్పటికీ, అది సాధ్యం కాలేదు. అమిత్ షా కుమారుడు జై షా ఐసీసీ చీఫ్ గా ఉన్నప్పటికీ, భారత్ కు ఈ ట్రోఫీ ఇచ్చి తీరాల్సిందేనని ఆయన నఖ్వీకి చెప్పలేకపోయారంటున్నారు. నిబంధనల సాకు చూపి ట్రోఫీ ఇవ్వడానికి నఖ్వీ నిరాకరిస్తున్నారు. ఐసీసీ కూడా ఏం చేయలేక ఇక చేతులెత్తేసింది. ఆసియా కప్ తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య తలెత్తిన వివాదాల పరిష్కారానికి ఐసీసీ బోర్డు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. బీసీసీఐ తాజాగా జరిగిన ఐసీసీ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఆ తరువాత రెండు దేశాల మధ్య వివాదంలో జోక్యం చేసుకోవడానికి ఐసీసీ అంగీకరించింది. ఆసియా కప్‌పై భారత్, పాకిస్తాన్ రెండూ తమ తమ వైఖరికి కట్టుబడి ఉండటంతో ఒమన్ క్రికెట్ బోర్డు చైర్మన్ పంకజ్ ఖీమ్జీ నేతృత్వంలో మధ్యవర్తిత్వ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగిందని, భారత్, పాక్ క్రికెట్ ప్రపంచంలో ముఖ్య దేశాలని, కాబట్టి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఐసీసీ కోరుతోంది.





50 మిలియన్ల వ్యూస్ దాటిన ‘మీసాల పిల్ల’

మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘మన శంకరవరప్రసాద్ గారు’ ఫస్ట్ సింగిల్ ‘మీసాల పిల్ల’ 50 మిలియన్ల వ్యూస్ క్రాస్ చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తెలుగు సినిమా మ్యూజిక్ కి కొత్త బెంచ్ మార్క్‌ను నెలకొల్పింది. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం పండగ వాతావరణంలో, కుటుంబమంతా కలిసి చూసేలా ఉండే ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. ఆ వైబ్‌ను అద్భుతంగా అందించిన సాంగ్ “మీసాల పిల్ల”. భీమ్స్ సెసిరోలియో అందించిన ఎనర్జిటిక్ ట్యూన్, బీట్‌లతో ఈ పాట దేశవ్యాప్తంగా చార్ట్ బస్టర్‌గా మారింది. తెలుగు పాటగా ఇంత పెద్ద స్థాయిలో పాన్‌ఇండియా రీచ్ సాధించడం అరుదైన ఘనత. మెగాస్టార్ చిరంజీవి తన సిగ్నేచర్ చార్మ్, ఎక్స్ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ముఖ్యంగా నయనతారతో ఉన్న సీన్స్‌లో ఆయన టైమింగ్ ఫ్యాన్స్‌ని అలరించింది. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ వోకల్స్ కట్టిపడేశాయి. ఆకట్టుకునే హుక్‌లైన్ తో ఈ సాంగ్‌ను సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మార్చేశాయి. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, రీల్స్ ఎక్కడ చూసినా “మీసాల పిల్ల” ఫీవర్‌నే కనిపిస్తోంది. అభిమానులు డాన్స్ చేస్తూ, రీమిక్స్‌లు చేస్తూ, తమ ప్రేమను అద్భుతంగా వ్యక్తపరుస్తున్నారు.

కౌశిక్ గోల్డ్ & డైమండ్స్ ప్రచారకర్తగా

జాన్వి స్వరూప్ ఘట్టమనేని

కౌశిక్ గోల్డ్ & డైమండ్స్ తన తాజా క్యాంపెయిన్ లాంచ్ చేసింది. ఈ కొత్త క్యాంపెయిన్ లో ఆభరణాల అందానికి జీవం పోసిన జాన్వి స్వరూప్ ఘట్టమనేని తన ఫస్ట్ ఆన్‌స్క్రీన్ ప్రజెన్స్ తో అందరిని ఆకట్టుకుంది. నటి-దర్శకురాలు మంజుల ఘట్టమనేని కుమార్తెగా, సూపర్ స్టార్ కృష్ణగారి మనవరాలిగా జాన్వి కళాత్మక వారసత్వానికి ప్రతీక. ఆత్మవిశ్వాసంతో, అభిరుచితో, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఆమె ప్రజెన్స్ ప్రత్యేకంగా నిలిచింది. బ్రాండ్ క్రియేటివ్ టీమ్ మొదట జాన్వి ఫోటోలు సోషల్ మీడియాలో చూసిన వెంటనే మెస్మరైజ్ అయ్యారు. కౌశిక్ గోల్డ్ & డైమండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కునాల్ మాట్లాడుతూ.. జాన్వి లో ఒక క్లాసిక్ టచ్, డిజైన్ చేయలేని ఒక అరుదైన బ్యూటీ ,అథెంటిసిటీ వుంది. ఆమెను మొదటిసారి పరిచయం చేసే గౌరవం మాకు దక్కడం ఆనందంగా ఉంది. ఇది డెస్టినీ మాకే అప్పగించిన అవకాశంలాగా అనిపించింది. జాన్వి మా బ్రాండ్ విలువలన్నింటినీ ప్రతిబింబిస్తుంది.” సినిమాటిక్ స్టయిల్ లో అద్భుతంగా తెరకెక్కిన ఈ యాడ్ ఫిలింలో జాన్వి, కౌశిక్ ఆభరణాలతో మెరిసిపోతుంది. ప్రతి ఆభరణం ఒక కథ చెబుతుంది, ప్రతి ఫ్రేమ్ భావోద్వేగంతో వెలుగుతుంది. బ్రైడల్, డైమండ్ కలెక్షన్‌లలో ఆమె అలంకరించుకున్న తీరు కెమెరా కోసం పుట్టిన స్టార్ లా సహజమైన సొగసుతో ఆకట్టుకుంది. ఈ ఫిలిం కేవలం ఆభరణాల గురించి మాత్రమే కాదు.. భావోద్వేగాల గురించి కూడా. ఒక మహిళ తనను తాను ఆభరణాలతో కాకుండా, ఆత్మవిశ్వాసంతో అలంకరించుకునే ఆ క్షణాన్ని ఇది ప్రజెంట్ చేస్తోంది. అద్భుతమైనరంగులు, శాశ్వతమైన స్వరాలు, గ్రేట్ విజువల్స్ ద్వారా ఈ క్యాంపెయిన్ నిజమైన అందం మనసులోంచే వెలుగుతుందనే కౌశిక్ ఫిలాసఫీని ప్రతిబింబిస్తుంది.





బాలయ్య పవర్ ఫుల్ ‘తాండవం’

గాడ్ ఆఫ్ ది మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా ‘అఖండ 2: తాండవం’. ఇది వారి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ అఖండకు సీక్వెల్. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ‘అఖండ 2: తాండవం’ ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న తాండవం సాంగ్ ప్రోమో రిలీజ్ చేశారు. మ్యూజిక్ సెన్సేషన్ తమన్ పవర్ ఫుల్ బీట్స్, డివోషనల్ చాంట్స్ తో ఈ సాంగ్ ని అద్భుతంగా కంపోజ్ చేశారు. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో డమరుకంతో బాలకృష్ణ చేసిన అఖండ తాండవం గూస్ బంప్స్ తెప్పించింది. ప్రోమో సాంగ్ పై అంచనాలని భారీగా పెంచింది. ఫుల్ సాంగ్ నవంబర్ 14న విడుదల కానుంది. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షా లి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200